'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com


'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 77 | ఆదివారం | 1.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 77 | Sunday | 1.11.2026 | Pages: 8 | Rate: 2

పౌర సరఫరా.. అవినీతిని ఆపరా?

వివరాలు 7లో..



- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- పేదల కడుపు కొడుతున్న బ్లాక్ మార్కెట్ దెయ్యం
- మంత్రి ఉత్తుత్తి వార్నింగ్
- అక్రమార్కులతో అధికారులు ఫిక్సింగ్

• కార్డుల నుంచి గోదాముల వరకు.. ఎక్కడెక్కడ అక్రమాలు?

ఒకవైపు మార్కెట్లో బియ్యం ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. మరోవైపు పేదల ఆకలి తీర్చాల్సిన ఉచిత రేషన్ బియ్యం చుట్టూ అనేక అనుమానాలు ముసురుకుంటున్నాయి! ప్రభుత్వ ఖజానా నుంచి వేల కోట్ల రూపాయల సబ్సిడీ వెచ్చిస్తున్నా.. ఆ బియ్యం నిజమైన లబ్ధిదారుడి ఇంటికే చేరుతోందా? అర్హుల పేరుతో అనర్హులు ప్రయోజనాలు పొందుతున్నారా? మరణించిన వారి పేర్లు, వలస వెళ్లిన కుటుంబాల వివరాలు, నకిలీ కార్డులు, ఒకే వ్యక్తి పేరు అనేకసార్లు ఎంట్రీ కావడం, ఇవన్నీ ప్రజాధనానికి గండికొడుతున్నాయి? గోదాముల్లో నిల్వల లెక్కలు ఒకలా.. మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం మరోలా.. దుకాణాల్లో పంపిణీ లెక్కలు ఇంకోలా ఉంటే అసలు నిజం ఎక్కడ దాగుంది? తెలంగాణలో ఏటా 28.56 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా, అందుబాటులో ఉన్నట్లు చెబుతున్న నిల్వలు, రావాల్సిన నరఫరాలపై ఇప్పుడు లెక్కల పరిశీలన అవసరమైంది. రేషన్ కార్డులపై ప్రత్యేక సమగ్ర విచారణ జరపాలని సామాజిక కార్యకర్త దరఖాస్తుదారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. అనర్హుల ఏరివేత పేరుతో నిజమైన పేదల పొట్టకొట్టకూడదు.. అక్రమాల పేరుతో ప్రజాధనం దోచుకున్నవారిని వదిలిపెట్టకూడదు. కార్డుల వెనుక కథ ఏమిటి? బియ్యం మాయమవుతున్న దారులేవి? ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టం ఎంత? తెరవెనుక బాధ్యులెవరు? రేషన్ బియ్యం చుట్టూ అల్లుకున్న ఈ మాయాజాలం ఏంటి?



రేపు హైదరాబాద్‌కు అమిత్ షా!

బీజేపీ పాదయాత్రకు కేంద్ర మంత్రి రాక

తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ తన ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌కు రానున్నారు. నవంబర్ 2న తెలంగాణ బీజేపీ నిర్వహించనున్న పాదయాత్రలో ఆయన పాల్గొననున్నారు. 2024 మేలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తర్వాత తొలిసారిగా ఆయన రాష్ట్రానికి వస్తుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. (2లో..)



క్రాప్ హాలీడే అంటూ తప్పుడు ప్రచారం!

రైతులను విపక్షాలు తప్పదోవ పట్టిస్తున్నాయ్!

పంటల సెలవు ప్రకటించలేదన్న తుమ్మల

తెలంగాణలో పంటల సాగుకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖండించారు. ప్రభుత్వం ఎక్కడా పంటల విరామం ప్రకటించలేదని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి కొరత, ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు దూరంగా ఉండాలని మాత్రమే రైతులకు సూచించినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, సమగ్ర పంటల సాగు చేపట్టాలని ప్రభుత్వం సలహా ఇచ్చిందన్నారు. (వివరాలు 2లో..)



హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్లకు శ్రీకారం!

నేటి నుంచే కొత్త సేవలు..

శుద్ధి చేసిన నీటి సరఫరా

హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సచివాలయంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు, ల్యాండ్‌స్కేపింగ్, శుభ్రతతో పాటు తాగునీటితో సంబంధం లేని అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. (వివరాలు 2లో..)



ఇందిరమ్మ టవర్స్ ఇళ్లకు లాటరీ

నవంబర్ 3, 4 తేదీల్లో ఈ-లాటరీ

యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం

నాలుగు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు

హైదరాబాద్‌లో అల్పాదాయ వర్గాల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌లోఫ్లాట్ల కేటాయింపునకు లాటరీ తేదీలను ఖరారు చేసింది. నవంబర్ 3న ముషీరాబాద్, ఎల్‌బీనగర్, చంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. (వివరాలు 2లో..)



ఇందిరాగాంధీకి రేవంత్ రెడ్డి నివాళులు

శక్తి స్థల్‌లో పుష్పాంజలి ఘటించిన సీఎం

మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలోని శక్తిస్థల్‌ను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఇందిరాగాంధీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ఆమె సేవలను స్మరించుకున్నారు. దేశానికి ప్రధానిగా ఆమె అందించిన సేవలు, నాయకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.



3లో..

సీఈసీపై ఇండియా కూటమి సమరం

- జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం
- మాక్ పార్లమెంట్‌లో కీలక తీర్మానం
- ఖర్గే నివాసంలో కేంద్రంపై పోరాటం

దేశ ఎన్నికల వ్యవస్థపై రాజకీయ పోరు మరో కీలక మలుపు తిరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి శనివారం నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన తీర్మానాన్ని కూటమి నేతలు ఏకగ్రీవంగా ఆమోదించారు.



చనిపోయిన వారి ఓట్లు తొలగించొద్దా?

- మొదటి ఓటు చోరీ నెహ్రూ కోసమే!
- పటేల్ జయంతి వేదికగా కిషన్ రెడ్డి విమర్శలు

చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా? వద్దా? ఇప్పుడు ఓట్ల చోరీ అంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. (వివరాలు 2లో..)

దమ్ముంటే బ్యాలెట్‌తో రండి!

- ఈవీఎంలపై విమర్శలా.. ఎన్నికలకు సిద్ధమా?
- ప్రభుత్వాన్ని రద్దు చేయాలని రేవంత్‌కు బండి సవాల్




తెలంగాణ రాజకీయాల్లో ఈవీఎంల వ్యవహారం మరోసారి వేడెక్కింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గట్టి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి, బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సవాల్‌ను స్వీకరిస్తే తాను కూడా పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి బ్యాలెట్ ఎన్నికలకు సహకరించేలా ప్రయత్నిస్తానన్నారు. (2లో..)



రాహుల్‌ను ప్రధాని చేయండి!

మాక్ పార్లమెంట్‌పై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

ప్రజాస్వామ్యానికి అవమానమంటూ ధ్వజం



3లో..

జర్నలిస్ట్‌తో సీఎం రెండో పెళ్లి

కొత్త జీవితంలోకి ఒమర్ అబ్దుల్లా!

నిధి రజ్దాన్‌తో వైవాహిక బంధం

ఢిల్లీలో నిరాడంబరంగా వివాహ వేడుక

భూములు అమ్మి పాలన సాగిస్తారా?

- మియాపూర్ భూముల అమ్మొద్దు!
- రేవంత్ రెడ్డికి డీకే అరుణ కౌంటర్




మియాపూర్‌లో సుప్రీంకోర్టు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిన 550 ఎకరాల భూములను వేలం వేసి సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనపై బీజేపీ ఎంపీ డీకే అరుణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు అమ్మి రాష్ట్రాన్ని నడపాలనుకోవడం పాలనలో అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఢిల్లీకి పంపుతున్న నిధులను నిలిపివేస్తే రాష్ట్ర అభివృద్ధికి సరిపడా డబ్బులు అందుబాటులో ఉంటాయని వ్యాఖ్యానించారు. (2లో..)

అబద్ధాలకు ఆస్కార్ ఇస్తే రేవంత్‌కే!

» మియాపూర్ క్రెడిట్ మాదే..!

» భూములు కాపాడింది మేమే

» క్రెడిట్ కొట్టేసేది మీరా? హరీశ్ ఫైర్



మియాపూర్ భూముల కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్ధానికి అంగీ, లాగు తొడిగితే అచ్చం రేవంత్ రెడ్డిలా ఉంటుందని ఘాటుగా వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)

కబ్జా ఆస్తి.. సుప్రీం శాస్తి

నవాబుల ఆస్తులపై రుబాబు

- సుప్రీం తీర్పుతో ప్రభుత్వం జవాబు
- పాజిషన్ పేరుతో ప్రైవేట్ వ్యక్తుల దందా
- న్యాయస్థానం ఆదేశాలతో కబ్జా ఆస్తులు గోవిందా
- మియాపూర్ భూదందాపై నా దేశం ఇన్‌డెప్త్ అనాలసిస్

వివరాలు 5లో..

ఒకప్పుడు నవాబుల చేతుల్లో ఉన్న భూములు.. ఆ తర్వాత ప్రభుత్వ ఖజానాలోకి చేరిన ఆస్తులు.. కాలం మారింది.. హైదరాబాద్ రూపురేఖలు మారాయి.. భూముల ధరలు కోట్లకు చేరాయి.. అంతే! ప్రభుత్వ భూములపై ప్రైవేటు హక్కుల వేట మొదలైంది. పాత ఫర్మానాలు తెరపైకి వచ్చాయి.. వారసత్వ హక్కుల వాదనలు వినిపించాయి.. పహాణీల్లో పేర్లు ప్రత్యక్షమయ్యాయి.. అధికారుల సహకారంతో రెవెన్యూ రికార్డులు మారాయన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఏకంగా 550 ఎకరాల 39 గుంటల విలువైన భూములపై హక్కుల కోసం సాగిన ఈ పోరాటంలో అసలు గుట్టును సుప్రీంకోర్టు రట్టు చేసింది. 1912లోనే ప్రభుత్వ పోరంబోకుగా నమోదైన భూములు.. 1949లో జాగీర్ల రద్దుతో ప్రభుత్వానికి సంక్రమించిన ఆస్తులని తేల్చింది. జాగీర్దారులకు ఉన్నది ఆదాయ హక్కులే తప్ప యాజమాన్యం కాదని స్పష్టం చేసింది. నకిలీ రెవెన్యూ నమోదులు, అధికార పరిధి లేని అనుమతులు, నిరూపణ కాని వీలునామాలతో ప్రభుత్వ ఆస్తులను సొంతం చేసుకునే ప్రయత్నాలను తప్పుబట్టింది. ఒక్కో పత్రాన్ని పరిశీలించింది.. ఒక్కో వాదనను ప్రశ్నించింది.. చివరకు ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లన్నింటికీ చెల్లుచీటీ రాసింది. భూమి ప్రభుత్వానిదే.. హక్కు ప్రభుత్వానిదే.. మోసపూరిత వాదనలకు న్యాయస్థానంలో స్థానం లేదని 550 ఎకరాల వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్పష్టం చేసింది! ఈ భూవివాదం వెనుక వందేళ్ల చరిత్ర.. తెరపైకి వచ్చిన సంచలన అంశాలేమిటి?

ర్యాపిడోలో బంగారం పంపితే.. రైడర్‌కి పండగే!



2లో..

- డెలివరీ పేరుతో రూ.62 వేల బంగారం మాయం!
- పార్శిల్ తీసుకున్నాడు.. బంగారంతో పరారయ్యాడు!

హైదరాబాద్‌లో ఆన్‌లైన్ సేవలపై నమ్మకం పెట్టుకుంటే ఇలా ఉంటుందా అంటూ ఓ బాధితుడు లబోదిబోమంటున్నాడు. బైక్‌పై వెళ్లాల్సిన రైడర్ ఏకంగా బంగారు నగలతోనే మాయమయ్యాడని ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. వివో సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న దత్తప్రసాద్ నీతిపల్లి అక్టోబర్ 27న తన బంధువులకు నగలు పంపేందుకు ర్యాపిడో పార్శిల్ సేవను బుక్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డు బిజు చేతికి పార్శిల్ అందించి నాగోల్‌లోని బంధువులకు చేర్చాలని సూచించారు.

రాప్తాడులో రక్తపాతం

పాఠశాలలో బాలికపై రంపంతో దాడి! తరగతి గదిలోనే ఉన్మాది కిరాతకం

ప్రాణాపాయంలో విద్యార్థిని

బెంగళూరుకు తరలింపు

పోలీసుల అదుపులో నిందితుడు


ఈ ఘటనను ఒక సాధారణ నేర వార్తగా చూడలేం. చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లిన పదో తరగతి బాలికపై, అందరూ చూస్తుండగానే తరగతి గదిలో ఎలక్ట్రిక్ రంపంతో దాడి జరగడం కలచివేస్తోంది. పాఠం చెబుతున్న ఉపాధ్యాయురాలు, తరగతిలో ఉన్న 31 మంది విద్యార్థులు ఒక్కసారిగా భయంతో వణికిపోయారు. బాలిక ముఖంపై తీవ్ర గాయాలు, కుడిచేయి తెగిపోవడంతో పరిస్థితి విషమించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. అసలు దాడి చేసింది ఎవరు? పాఠశాలలోకి రంపంతో ఎలా వచ్చాడు? బాలికపై ఎందుకు ఇంతటి కక్ష పెంచుకున్నాడు? దాడి తర్వాత ఏం జరిగింది? ప్రస్తుతం బాలికకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు?

తరగతి గదిలో ఏం జరిగింది?

2 నిమిషాల్లో అంతా మారిపోయింది!

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం సుమారు 10.30 గంటలకు ఈ దారుణం జరిగింది. అయ్యవారిపల్లెకు చెందిన పదో తరగతి విద్యార్థిని ముదగ గోపిక ఎప్పటిలాగే ఆటోలో పాఠశాలకు చేరుకుంది. గణిత పాఠం జరుగుతున్న సమయంలో హేమంత్ అనే వ్యక్తి ఒక్కసారిగా తరగతి గదిలోకి ప్రవేశించాడు. నేరుగా గోపిక వద్దకు వెళ్లి ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేశాడు. క్షణాల్లో తరగతి గది రక్తసిక్తమైంది. ఆ సమయంలో గదిలో 31 మంది విద్యార్థులు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థంకాక కొందరు విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సాకే లక్ష్మి అనే మరో బాలిక కాలికి గాయమైంది. దాడి జరిగిన రెండు, మూడు నిమిషాల్లోనే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. రంపాన్ని తరగతి గదిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఉపాధ్యాయురాలు రాజరాజేశ్వరి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించారు.





ఎవరీ హేమంత్.. ఎందుకీ దాడి?

ప్రేమ పేరుతో వేధింపుల అనుమానం

గోపికపై దాడి చేసిన వ్యక్తిని ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన హేమంత్‌గా పోలీసులు గుర్తించారు. అతడు బాధితురాలికి దగ్గరి బంధువుగా విచారణలో వెల్లడైంది. తల్లిదండ్రులు చనిపోవడంతో కొంత కాలంగా అక్క కుటుంబానికి దగ్గరగా ఉంటున్నట్లు సమాచారం. అనంతపురం టమాటా మార్కెట్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్న హేమంత్ ఇటీవలే ఎలక్ట్రిక్ రంపాన్ని కొనుగోలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో రంపం కవర్ లభించడంతో దాడికి ముందే పాఠశాల పరిసరాలను పరిశీలించాడా? తరగతి గదిని గమనించాడా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గోపిక ప్రేమను నిరాకరించడంతో హేమంత్ ఈ దాడికి పాల్పడ్డాడనే ప్రచారం ఉన్నప్పటికీ, దాడికి అసలు కారణం ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. పోలీసులు హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

బాలిక పరిస్థితి ఎలా ఉంది?

దాడిలో గోపిక ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. కుడిచేయి తెగిపోవడంతో రక్తస్రావం అధికమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడింది. మరో బాలిక సాకే లక్ష్మికి కాలిపై గాయాలయ్యాయి. ఇద్దరినీ తొలుత అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. గోపిక పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సాయంత్రం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించారు. అత్యాధునిక అంబులెన్స్‌లో వైద్య బృందం పర్యవేక్షణలో ఆమెను బెంగళూరుకు తీసుకెళ్లారు. అనస్థీషియా నిపుణుడు, శస్త్రచికిత్స వైద్యుడు కూడా ఆ బృందంలో ఉన్నారు. బాలిక తల్లిదండ్రులకు వైద్యులు పరిస్థితిని వివరించి, అవసరమైన కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం బాలికకు మెరుగైన చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యంగా వైద్య బృందం పనిచేస్తోంది.

ముఖ్యమంత్రి ఆరా

ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా, సమగ్రంగా దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా తీశారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన విద్యార్థిని పరిస్థితిని పరిశీలించారు. మరోవైపు ప్రత్యేక పోలీసు బృందాలు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి, ధర్మవరం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నాయి. పాఠశాలలో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో బయటివారు రాకపోకలు సాగిస్తున్నారని హెచ్ఎం వెల్లడించారు. రంపంతో వ్యక్తి పాఠశాలలోకి ఎలా ప్రవేశించాడని బాలిక బంధువులు ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రశ్నించారు. తమ బంధువైనా సరే నిందితుడికి కఠిన శిక్ష పడాలని బాలిక మేనత్త డిమాండ్ చేశారు. ఈ ఘటన పాఠశాలల భద్రత, బయటి వ్యక్తుల ప్రవేశ నియంత్రణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.



వైఎస్ జగన్ పంతం.. సర్కార్ తంత్రం

పులివెందులలో పిడుగు లాంటి ఎన్నిక?

వైఎస్సార్ బ్రాండ్ నేలపై కనీవినీ ఎరుగం



ఒకప్పుడు పులివెందులలో ఎన్నికలంటే ఫలితం ముందే తెలిసినట్లుగా ఉండేది. వైఎస్ కుటుంబానికి బలమైన రాజకీయ పట్టున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఒక మున్సిపల్ ఎన్నిక రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠకు కేంద్రంగా మారింది. ఎన్టీఆర్ హయాంలోనూ, చంద్రబాబు పాలనలోనూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలోనూ ఇలాంటి ఆసక్తికరమైన పోటీ కనిపించలేదన్న చర్చ సాగుతోంది. ఈసారి పులివెందులలో పడే ప్రతి ఓటు స్థానిక అభ్యర్థుల భవిష్యత్తుతో పాటు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతిష్ఠకు కూడా ముడిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ వ్యూహం, మంత్రి నారా లోకేశ్ లక్ష్యం, బీటెక్ రవి రాజకీయ ప్రతిష్ఠ, వైఎస్ జగన్ ప్రభావం.. ఇలా అనేక అంశాలు ఈ ఎన్నిక చుట్టూ తిరుగుతున్నాయి. అందుకే పులివెందుల పోలింగ్ పై రాష్ట్ర రాజకీయ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఇది కేవలం మున్సిపల్ పాలకవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదని, రాజకీయ బలాబలాలను అంచనా వేసే కీలక ఘట్టమని ఇరు పార్టీల శ్రేణులు భావిస్తున్నాయి.

కుప్పం రాజకీయానికి పులివెందుల సమాధానమా?

ఈ పోటీ ఇంతటి ప్రాధాన్యం సంతరించుకోవడానికి గత రాజకీయ పరిణామాలూ ఒక కారణంగా కనిపిస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు పట్టున్న కుప్పం మున్సిపాలిటీని వైసీపీ కైవసం చేసుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ విజయం వెనుక అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ అండ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యూహం ఉన్నాయని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి పులివెందులలో తన బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని, లోకేశ్ ఈ పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. బీటెక్ రవికి ఇది స్థానిక రాజకీయ పట్టును నిరూపించుకునే కీలక అవకాశం. మరోవైపు పులివెందుల జగన్‌కు రాజకీయంగా, కుటుంబ పరంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న ప్రాంతం. ఇక్కడ వైసీపీకి ఎదురయ్యే సవాలు ఆయన నాయకత్వ ప్రభావంపై చర్చకు దారితీయవచ్చు. అయితే ఈ పోటీ వెనుక ఉన్న వ్యూహాలు, లక్ష్యాలపై వినిపిస్తున్నవి రాజకీయ అంచనాలే. వాటిని నిర్ధారించే అంశం మాత్రం ఓటర్ల తీర్పే.

గెలుపోటములతో మారనున్న రాజకీయ చర్చ

ఈ ఎన్నికలో టీడీపీ విజయం సాధిస్తే పులివెందులలో వైసీపీ పట్టుపై ప్రత్యర్థులు ప్రశ్నలు లేవనెత్తే అవకాశం ఉంటుంది. చంద్రబాబు వ్యూహానికి రాజకీయ విజయమని కూటమి శ్రేణులు ప్రచారం చేసుకోవచ్చు. లోకేశ్ రాజకీయ చొరవకు, బీటెక్ రవి స్థానిక నాయకత్వానికి బలం చేకూరిందని చెప్పుకోవచ్చు. అదే వైసీపీ గెలిస్తే అధికారంలో ఉన్న కూటమి ఒత్తిడిని ఎదుర్కొని జగన్ తన రాజకీయ ప్రభావాన్ని నిలబెట్టుకున్నారని ఆ పార్టీ శ్రేణులు అభివర్ణించే అవకాశం ఉంది. అయితే ఒక్క మున్సిపల్ ఎన్నిక ఫలితంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల రాజకీయ అభిప్రాయాన్ని నిర్ణయించలేం. స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలం, సామాజిక సమీకరణాలు, పోలింగ్ పరిస్థితులు కూడా ఫలితంపై ప్రభావం చూపుతాయి. ప్రచారంలో ఎవరు పైచేయి సాధించారన్నది ఇక ముఖ్యం కాదు. ఓటరు ఎవరికి మద్దతిచ్చాడన్నదే అసలు విషయం. పోలింగ్ శాతం, ప్రాంతాలవారీ ఓటింగ్ సరళి ఆసక్తి రేపినా తుది సమాధానం ఓట్ల లెక్కింపులోనే తేలుతుంది. చంద్రబాబు వ్యూహానికి ప్రజల మద్దతు లభించిందా? జగన్ ప్రభావం నిలిచిందా? లోకేశ్ లక్ష్యం నెరవేరిందా? బీటెక్ రవి ప్రతిష్ఠకు ఎలాంటి ఫలితం దక్కింది? ఈ ప్రశ్నలన్నింటికీ పులివెందుల ఓటరు ఇచ్చే తీర్పే సమాధానం. ఈ ఫలితం స్థానిక రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయ చర్చలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.



మరో తుపాను ముప్పు!

24 గంటల్లో తుపానుగా మారే అవకాశం

2న తీరానికి చేరువగా వాయుగుండం

సైక్లోన్ అర్నబ్ విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ ఇంకా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉంది. నవంబర్ 2 నాటికి మరో తుపాను ఆంధ్ర తీరానికి చేరువయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనంగా మారింది. శనివారం ఉదయం 8.30 గంటలకు విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, రాబోయే ఆరు గంటల్లో ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. అనంతరం మరో 24 గంటల్లో తుపానుగా మారవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

నవంబర్ 2న ఏపీ తీరానికి చేరువగా

బలపడుతున్న వాతావరణ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతం వైపు ప్రయాణించనుంది. నవంబర్ 2 సాయంత్రానికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి చేరవచ్చని ఐఎండీ వెల్లడించింది. అయితే ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే అంచనాను ప్రకటించలేదు. ఇప్పటికే అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటిన సైక్లోన్ అర్నబ్ కనీసం ఐదుగురి ప్రాణాలు తీసింది. భారీగా పంటలు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త వాతావరణ వ్యవస్థపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

భారీ వర్షాలు.. సముద్రంలో అలజడి

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో నవంబర్ 5 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కేరళ, మాహే ప్రాంతాల్లో నవంబర్ 4 వరకు వర్షాలు పడవచ్చని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నవంబర్ 1 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. అప్పుడప్పుడు గాలుల వేగం 50 కిలోమీటర్లకు చేరవచ్చని అంచనా వేసింది. మత్స్యకారులు సముద్ర పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలని సూచించింది.

ఆ కృతజ్ఞత మర్చిపోలేను

53 రోజుల జైలు జీవితం

ప్రజలకు చంద్రబాబు కృతజ్ఞతలు

నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న సీఎం

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి తాను విడుదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 53 రోజుల జైలు జీవితం తన 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అత్యంత కఠినమైన సమయమని పేర్కొన్నారు. సంధ్యాలలో కనీస నోటీసు కూడా ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్టు చేశారని, అది కుట్రపూరిత మైన అక్రమ నిర్బంధమని తన పోస్ట్‌లో ఆరోపించారు. ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నించినందుకే అప్పటి పాలకులు తనను అణచివేయాలని చూశారని విమర్శించారు. కోర్టు తీర్పుతో తిరిగి ప్రజల మధ్యకు వచ్చిన రోజును గుర్తుచేసుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల మద్దతు

తాను జైలులో ఉన్న సమయంలో రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా, 60కి పైగా దేశాల్లోని తెలుగు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతుగా నిలిచారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. గ్రామీణ మహిళల నుంచి కార్పొరేట్ సంస్థల అధిపతుల వరకు, రైతుల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకు అన్ని వర్గాల స్పందన తనను కదిలించిందన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నిర్వహించిన కృతజ్ఞత సభను జీవితాంతం మరిచిపోలేనని పేర్కొన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండే తన భార్య భువనేశ్వరి, కుటుంబ సభ్యులు కూడా ప్రజలతో కలిసి సత్యం కోసం నిలిచారని తెలిపారు.

ప్రజల కోసం చివరి వరకు పోరాటం

తన కష్టాన్ని తమదిగా భావించి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై చూపిన ప్రేమ, అభిమానం, నమ్మకమే తన బలమని పేర్కొన్నారు. ప్రజలు తనకు అండగా నిలిచినట్లే, తాను కూడా చివరి వరకు ప్రజల కోసం నిలబడతానని భరోసా ఇచ్చారు. వారి భవిష్యత్తే తన సంకల్పమని చెబుతూ, అందరి సహకారంతో 2047 నాటికి తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు.



సర్వం సిద్ధం!

నేడు మున్సిపల్ సమరం..



ఆంధ్రప్రదేశ్ లో నేడు మున్సిపల్ ఎన్నికల సమరం జరగనుంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 1న పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలుత అక్టోబర్ 28న జరగాల్సిన ఎన్నికలు.. నామినేషన్ల సమయంలో హింసాత్మక ఘటనలు, అభ్యర్థులకు ఎదురైన అడ్డంకులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. విశాఖపట్నం మేయర్ పదవిని టీడీపీకి, విజయవాడ మేయర్ పదవిని జనసేనకు కేటాయించారు. మరో 23 పట్టణ స్థానిక సంస్థల్లో న్యాయపరమైన, పరిపాలనా సమస్యలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 36,351 మంది పోలీసులను రంగంలోకి దించారు. 34 మంది ఎస్పీలు, 52 మంది అదనపు ఎస్పీల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లు, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. టీడీపీ నుంచి 15 మంది, జనసేన నుంచి ఒకరు, బీజేపీ నుంచి ఒకరు.. మొత్తం 17 మంది మున్సిపల్ చైర్ పర్సన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్షించి బ్యాలెట్ పత్రాల భద్రత, ఎన్నికల కోడ్ అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అక్రమాలపై ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విజయవాడలోని ఎస్ ఈసీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదులకు 0866 2490023, 2490024, 2490025, 2490026 సంబర్లను సంప్రదించవచ్చు.

కూటమా? వైసీపీనా?



విశాఖ తీర్పు ఎవరివైపు

గ్రేటర్ జడ్జిమెంట్ కోసం వెయిటింగ్

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర ముఖద్వారంగా, పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతున్న విశాఖపై కూటమి, వైసీపీ ప్రత్యేక దృష్టి పెట్టాయి. గతంలో వైసీపీ ప్రభుత్వం విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించి రుషికొండలో భవన నిర్మాణాలు, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాట్లకు చర్యలు చేపట్టింది. 2024 ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమితో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ ఎన్నికలు రాజకీయ ప్రతిష్ఠకు వేదికయ్యాయి. 2029 ఎన్నికలకు ముందు సెమీఫైనల్ గా ఈ పోరును ఇరు పక్షాలు చూస్తున్నాయి.

అభివృద్ధి అస్త్రం.. విమర్శల ఎదురుదాడి

అమరావతి, పోలవరం, గోదావరి జలాల తరలింపు, పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐటీ రంగ విస్తరణను కూటమి తన అభివృద్ధి అజెండాగా ప్రచారం చేస్తోంది. కేంద్ర నిధులు, కొత్త పెట్టుబడులు తమకు కలిసివస్తాయని భావిస్తోంది. మరోవైపు వైసీపీ రాజకీయ వేధింపులు, అక్రమ కేసులు, అరెస్టులు, స్థానిక ఎన్నికల్లో హింసాత్మక ఘటనలను ప్రస్తావిస్తోంది.

విశాఖ ఓటరు తీర్పు అంతుచిక్కని రహస్యం

విశాఖ రాజకీయ చరిత్రలో ఓటర్లు ఎప్పుడూ ఒకే పార్టీకి పరిమితం కాలేదు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనానికి మద్దతిచ్చిన ప్రాంతం, 1989లో కాంగ్రెస్ వైపు నిలిచింది. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డికి అండగా నిలిచింది. 2014లో వైఎస్ విజ యమ్మ విశాఖ లోక్‌సభ స్థానం నుంచి ఓడిపోయారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభంజనం ఉన్నప్పటికీ విశాఖలో ఆ పార్టీకి ఆశించిన స్థాయిలో అసెంబ్లీ స్థానాలు దక్కలేదు. స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలం, సామాజిక సమీకరణాలే ఈసారి కూడా కీలకమయ్యే అవకాశం ఉంది.

డేటా సెంటర్ల చర్చ.. స్థానిక సమస్యల సెగ

గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం, సింహాచలం కొండ ప్రాంతంలో ప్రతిపాదిత నిర్మాణాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ ప్రభావం, భూగర్భ జలాల వినియోగం, కాలుష్యం వంటి అంశాలపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సమస్య, ట్రాఫిక్, ఫుట్ పాత్‌ల ఆక్రమణలు, సింహాచలం భూముల వివాదం కూడా ఎన్నికల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టీడీపీ తరపున ముక్కా శ్రావణి, వైసీపీ తరపున వరుదు కల్యాణి పోటీలో ఉన్నారు. ఒకరికి కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం, వైద్యురాలిగా గుర్తింపు ఉండగా, మరొకరికి ఎమ్మెల్సీగా రాజకీయ అనుభవం ఉంది. జీవీఎంసీ పరిధిలో కూటమి ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం, ఎంపీ భరత్‌కు గతంలో వచ్చిన భారీ మెజారిటీ కూటమికి బలంగా కనిపిస్తున్నాయి. కూటమిలో అంతర్గత విభేదాలు, ప్రభుత్వంపై అసంతృప్తి తమకు అనుకూలిస్తాయని వైసీపీ ఆశిస్తోంది. ఇద్దరు మహిళా అభ్యర్థుల మధ్య పోరు ఇప్పుడు పార్టీల ప్రతిష్ఠకు పరీక్షగా మారింది.

రాహుల్‌ను ప్రధాని చేయండి!

మాక్ పార్లమెంట్‌పై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

ప్రజాస్వామ్యానికి అవమానమంటూ ధ్వజం



ప్రతిపక్ష ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రజాస్వామ్య సంస్థలను అపహాస్యం చేసేలా కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు వ్యవహరిస్తున్నాయని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర విమర్శించారు. పాత పార్లమెంట్ భవనాన్ని పోలిన నమూనాలో సమావేశం నిర్వహించడాన్ని ప్రస్తావిస్తూ.. అంతగా పాత బ్రిటిష్ కాలం నాటి నిర్మాణాలపై ప్రేమ ఉంటే, అదే భవనంలో రాహుల్ గాంధీని మాక్ ప్రధానిగా కూర్చోబెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఈ మాక్ పార్లమెంట్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతీకాత్మక ప్రజాభిశంసన చేపట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. నిజమైన పార్లమెంట్‌లో చర్చలకు అడ్డుపడుతూ, బయట మాత్రం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

ఓట్ల చోరీ కాదు.. అక్రమాల ఏరివేత!

ఓట్ల చోరీ ఆరోపణలను సంబిత్ పాత్ర తోసిపుచ్చారు. కాంగ్రెస్‌కు చెందిన 38 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు సక్రమంగా పనిచేసి ఉంటే ఈ నాటకాలు అవసరమయ్యేవి కావని అన్నారు. 13 కోట్ల మంది ఓటు హక్కులు కోల్పోయారన్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలోనే పదిసార్లు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరిగిందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా సుమారు 12 కోట్ల మంది శాశ్వతంగా వలస వెళ్లారని, వారిలో ఆరు కోట్ల మంది ఫారం 6 ద్వారా ఓటరు జాబితాలో చేరేందుకు దరఖాస్తు చేశారని వివరించారు. మరణించిన వారి పేర్లతో 2.8 కోట్ల ఎంట్రీలు, దాదాపు కోటి నకిలీ పేర్లను తొలగించినట్లు తెలిపారు. ఫారం 6లో కేవలం ప్రకటన మాత్రమే జోడించారని, సుప్రీంకోర్టు తీర్పు దీనిపై స్పష్టత ఇచ్చిందని పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు రక్షణపై వివరణ

ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించేందుకు 2023లో బీజేపీ చట్టం తెచ్చిందన్న విమర్శనూ సంబిత్ పాత్ర ఖండించారు. రాజ్యాంగపరమైన రక్షణ ఇప్పటికే ఉందని, కొత్త చట్టం కేవలం విధివిధానాలను మాత్రమే నిర్దేశించిందని చెప్పారు. ఎస్ఐఆర్‌పై నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని వెల్లడించారు. మరోవైపు బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ప్రపంచ బ్యాంకు 2025 నివేదికను ప్రస్తావిస్తూ, 2011లో 27.6 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం 2023 నాటికి 2.6 శాతానికి తగ్గిందన్నారు. పేదరిక నిర్మూలనకు ఎన్డీఏ కట్టుబడి ఉంటే, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ దేశంలో అరాచక పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

సీఈసీపై ఇండియా కూటమి సమరం

మాక్ పార్లమెంట్‌లో కీలక తీర్మానం

ఖర్గే నివాసంలో కేంద్రంపై పోరాటం

జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం

దేశ ఎన్నికల వ్యవస్థపై రాజకీయ పోరు మరో కీలక మలుపు తిరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి శనివారం నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన తీర్మానాన్ని కూటమి నేతలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ అధ్యక్షత వహించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడిన పౌరులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రాహుల్ గాంధీ తీవ్ర హెచ్చరికలు

ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ప్రధాని మోదీ, అమిత్ షా వరకు ఈ వ్యవహారంలో బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. తమ వద్ద ఉన్న ఆధారాలు బయటపెడితే సీఈసీ పదవిలో కొనసాగడం సాధ్యం కాదన్నారు. ఖర్గే సైతం ఆరు ప్రధాన ఆరోపణలు చేశారు. 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్ల తొలగింపు, పార్లమెంట్ పర్యవేక్షణ లేకుండా ఫారం 6లో మార్పులు, ఈసీఐ నెట్ ద్వారా ఓటర్ల జాబితాల నిర్వహణ, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను పక్కనపెట్టడం వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రధాని, హోంమంత్రి ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం నేత నేహా బోరా సైతం సీఈసీపై తీవ్ర విమర్శలు చేశారు. శశిథరూర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతమధ్యవర్తిగా ఉండాల్సిన అర్హతను సీఈసీ కోల్పోయారని వ్యాఖ్యానించారు. మరోవైపు ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్ ప్రెస్ గతంలో కథనం ప్రచురించింది.



ఎస్ఐఆర్‌పై విపక్షాల తీవ్ర అభ్యంతరాలు

సమాజ్ వాదీ పార్టీ ఎంపీ మాలిక్ ఎస్ ఐఆర్ ప్రక్రియను పీడీఏ వర్గాలపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆరోపణ.

బీజేపీ ఎదురుదాడి.. నెహ్రూపై ఆరోపణలు

విపక్షాల మాక్ పార్లమెంట్‌పై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్ గాంధీని జీవితకాల మాక్ ప్రధాని చేసుకోవాలంటూ ఎంపీ సంబిత్ పాత్రా ఎద్దేవా చేశారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది పేర్లు తుది జాబితాలో చేరకపోవడంపై కాంగ్రెస్ ప్రశ్నలకు సమాధానంగా ఏఎస్‌డీడీ విధానాన్ని వివరించారు. గైర్హాజరు, శాశ్వతంగా వలస వెళ్లడం వంటి కారణాలతో పేర్లు తొలగే అవకాశం ఉందన్నారు. మరోవైపు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మద్దతుగా కాంగ్రెస్ నేతలు వేసిన ఓట్లను నెహ్రూ దొంగిలించి ప్రధాని అయ్యారంటూ సంబిత్ పాత్రా పాత రాజకీయ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. ఆదివారం రాంలీలా మైదాన్‌లో జరగనున్న ఢిల్లీ చలో సభలో సీఈసీ రాజీనామాను డిమాండ్ చేయాలని ఇండియా కూటమి నిర్ణయించింది.

డిజిటల్ సేవల్లో దూసుకెళ్తున్న మీ సేవా!

నెలలో 24.61 లక్షల లావాదేవీలు

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు



తెలంగాణలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో మీ సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. డిజిటల్ సేవల వినియోగం పెరుగుతుండటంతో కేంద్రాలు భారీ స్థాయిలో లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. సెప్టెంబర్ 2026లో రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా కేంద్రాల ద్వారా ఏకంగా 24,61,661 లావాదేవీలు విజయవంతంగా పూర్తయ్యాయి. కేవలం ఒక్క నెలలోనే రూ.585.05 కోట్ల విలువైన లావాదేవీలు జరగడం విశేషం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వివిధ సేవలను స్థానికంగానే పొందే అవకాశం ప్రజలకు లభిస్తోంది. దీంతో మీ సేవా కేంద్రాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది.

5,276 కేంద్రాలు.. 395 రకాల సేవలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 5,276 మీ సేవా కేంద్రాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. వీటి ద్వారా ప్రజలకు 393 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా మరో రెండు సేవలను జోడించడంతో మొత్తం సేవల సంఖ్య 395కు చేరింది. సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు సహా వివిధ అవసరాల కోసం ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకుంటున్నారు. డిజిటల్ విధానంలో సేవలు అందుబాటులోకి రావడంతో సమయం ఆదా కావడమే కాకుండా ప్రభుత్వ సేవల చేరువ కూడా పెరుగుతోంది. సాంకేతికతను ఉపయోగించి పౌర సేవలను వేగంగా, సులభంగా అందించడంలో మీ సేవా కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయి.

ఓర్నాయనో..



ఐపీఎస్ వైఫ్ & హజ్బెండ్ దోపిడీ

అధికారం అండతో 36 విల్లాలు!

కోట్ల కొలది ఆస్తుల లెక్కలు

అధికారంలో ఉంటే అడ్డూ అదుపూ ఉండదనుకున్నారో ఏమో.. ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించిన ఓ ఐఏఎస్ అధికారి కుటుంబం ఏకంగా 36 విల్లాల కొనుగోలు వ్యవహారంలో చిక్కుకుంది. రాజస్థాన్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి శిఖర్ అగర్వాల్, ఆయన భార్య ఐపీఎస్ అధికారి ప్రశాఖ మాథుర్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటు రిసార్టుల సంస్థకు ప్రయోజనాలు చేకూర్చారన్నది ప్రధాన అభియోగం. ప్రతిఫలంగా మార్కెట్ ధర కంటే తక్కువకు విల్లాలు కొనుగోలు చేశారన్న అనుమానాలు ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నాయి. దొరికితే దొంగలు.. దొరక్కపోతే దొరలు అన్నట్టుగా వ్యవహరించే అధికారుల బాగోతాలకు ఇదో ఉదాహరణగా మారింది.

ఒకేరోజు రిజిస్ట్రేషన్లు.. 20 విల్లాలు!

ఉదయ్‌పూర్‌లోని బుజ్జా ప్రాంతంలో అనంత రిసార్ట్ పరిధిలో 2026 మార్చిలో ఏకంగా 20 విల్లాలు కొనుగోలు చేసినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. ఇందులో పది విల్లాలు అగర్వాల్ పేరుతో, మరో పది ఆయన భార్య ప్రశాఖ మాథుర్ పేరుతో నమోదైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో విల్లా ధర సుమారు రూ.15 లక్షలుగా పేర్కొన్నారు. అంటే అక్కడే రూ.3 కోట్ల విలువైన ఆస్తుల లావాదేవీలు జరిగినట్లు అంచనా. కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కూడబెట్టడం వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు విచారణలో తేలాల్సి ఉంది.

పిల్లలు, అత్తమామలకూ వాటా!

అల్వార్ జిల్లాలోని అజబ్‌గఢ్ అనంత రిసార్టులో మరో 16 విల్లాలు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఎనిమిది విల్లాలు దంపతుల పేర్లపై, నాలుగు వారికుమారుల పేర్లపై, మరో నాలుగు అగర్వాల్ అత్తమామల పేర్లపై ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కో విల్లా ధర రూ.15 లక్షల నుంచి రూ.16.5 లక్షల వరకు ఉన్నట్లు వెల్లడైంది. ఇలా రెండు నగరాల్లో కలిపి 36 విల్లాలు.. సుమారు రూ.5.52 కోట్ల విలువైన ఆస్తులు విచారణ పరిధిలోకి వచ్చాయి. కుటుంబ సభ్యులందరికీ విల్లాల పంపిణీ చూస్తుంటే ఆస్తుల రిజిస్ట్రేషన్‌లోనూ కుటుంబ సమైక్యతకు కొత్త నిర్వచనం ఇచ్చినట్టే కనిపిస్తోంది!

ప్రభుత్వ ప్యాకేజీ.. అదే రోజు ఆస్తుల కొనుగోలు!

గోయల్ ఫ్యాషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న అనంత హోటళ్లు, రిసార్టులకు నిబంధనల సడలింపులు, ప్రత్యేక రాయితీలు కల్పించారన్న ఆరోపణలపై ఏసీబీ దృష్టి సారించింది. మార్చి 27, 2026న ఆ సంస్థకు ఆర్థిక శాఖ ప్రత్యేక రాయితీ ప్యాకేజీ మంజూరు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అదే రోజున అగర్వాల్ కుటుంబ సభ్యుల పేర్లపై 20 విల్లాల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. ఉదయ్‌పూర్ కలెక్టర్‌గా, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్‌గా, పరిశ్రమల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ సాగుతోంది. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్ కింద ప్రభుత్వం ముందస్తు అనుమతి ఇవ్వడంతో ఏసీబీ దర్యాప్తు వేగం పెరిగింది. ఆరోపణలు నిజమా కాదా అనేది విచారణలో తేలాలి. అప్పటివరకు విల్లాల లెక్కలు మాత్రం రాజస్థాన్‌లో హాట్ టాపిక్‌గా మారాయి!

823 ఎకరాలపై బీఆర్ఎస్ అభ్యంతరం!

రెవెన్యూ భూములు



ఫారెస్ట్‌కు ఇవ్వొద్దు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గోపాల్ పేట, బుద్దారం, ఏదుల, చెన్నారం, చీర్కపల్లి, తల్పునూరు గ్రామాల పరిధిలో 823 ఎకరాల రెవెన్యూ భూములను ఫారెస్ట్ భూములుగా మార్చే ప్రతిపాదనపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిరుపతి యాదవ్, బుద్దారం సర్పంచ్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నిర్ణయంతో స్థానిక రైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. భూములు కోల్పోతున్న బుద్దారం రైతులకు పరిహారంగా డబ్బులకు బదులుగా ఒక ఎకరాకు రెండు ఎకరాల ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భూములను వారికే కేటాయించాలని, లేదంటే యథాతథంగా ఉంచాలని కోరారు. పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లపై కొరడా!

స్థానిక చెట్లతో మార్పిడికి హైకోర్టు ఆదేశాలు

ఆరోగ్య, పర్యావరణ ప్రభావాలపై పరిశీలన

సిద్దిపేటలో ఫిర్యాదుపై న్యాయస్థానం స్పందన



తెలంగాణలో కోనోకార్పస్ చెట్ల పెంపకంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో నాటిన ఈ చెట్ల వల్ల ప్రజారోగ్యం, పర్యావరణానికి నష్టం కలుగుతోందంటూ వచ్చిన ఫిర్యాదును పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. జస్టిస్ సూరేపల్లి నందా అక్టోబర్ 6న రిట్ పిటిషన్ నం.33650/2026పై ఈ ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ గదగోని చక్రధర్ గౌడ్ సెప్టెంబర్ 9న అధికారులకు వినతిపత్రం సమర్పించినా స్పందన లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోనోకార్పస్ స్థానంలో వేప, రావి, పొంగం, మర్రి వంటి స్థానిక వృక్ష జాతులను నాటే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

ఆరోగ్య సమస్యలు.. పర్యావరణంపై ఆందోళనలు

కోనోకార్పస్ పుష్పరేణువులతో శీతాకాలంలో శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పిటిషనర్ వాదించారు. భూగర్భ జలాల తగ్గుదల, జీవవైవిధ్యానికి ముప్పు, మౌలిక సదుపాయాలపై ప్రతికూల ప్రభావాల అంశాలను కూడా ప్రస్తావించారు. సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ 2025 ఆగస్టు 21న సమర్పించిన నివేదికలోని అంశాలను ఆయన తరపు న్యాయవాది కల్వ రాజేష్‌కుమార్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోనోకార్పస్ పెంపకంపై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని కమిటీ సిఫార్సు చేసిందన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు.

నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలి

పిటిషనర్ ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, ఆరోగ్య సమస్యలు, భూగర్భ జలాలు, జీవవైవిధ్యం, మౌలిక సదుపాయాలపై సాంకేతిక అధ్యయనం చేయాలని హైకోర్టు ఆదేశించింది. స్థానిక వృక్ష జాతులతో మార్పిడి చేసే అంశంపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఉత్తర్వుల ప్రతిని అందుకున్న తేదీ నుంచి నాలుగు వారాల్లో తీసుకున్న చర్యల నివేదికను పిటిషనర్‌కు తెలియజేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది. ఈ ఉత్తర్వులతో సిద్దిపేటలోని కోనోకార్పస్ చెట్లపై అధికారుల పరిశీలనకు మార్గం ఏర్పడింది. ఇతర పట్టణాల్లోనూ ఈ చెట్ల ప్రభావంపై శాస్త్రీయ పరిశీలన అవసరమనే చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది.



జర్నలిస్ట్‌తో సీఎం రెండో పెళ్లి

కొత్త జీవితంలోకి ఒమర్ అబ్దుల్లా!

నిధి రజ్దాన్‌తో వైవాహిక బంధం

ఢిల్లీలో నిరాడంబరంగా వివాహ వేడుక



జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా (56) జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ప్రముఖ జర్నలిస్ట్ నిధి రజ్దాన్‌ను ఆయన రెండో వివాహం చేసుకున్నారు. అక్టోబర్ 30న న్యూఢిల్లీలో అత్యంత నిరాడంబరంగా జరిగిన వేడుకలో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. వివాహానికి సంబంధించిన ఫొటోలను ఎక్స్‌లో పంచుకున్న ఒమర్ అబ్దుల్లా 'నిన్న కొత్త ప్రయాణం ప్రారంభమైంది' అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిధి రజ్దాన్ సైతం పెళ్లి ఫొటోలను పంచుకుంటూ 'ఇట్స్ దన్ బ్రో' అంటూ ఉంగరం గుర్తుతో సరదాగా స్పందించారు. వీరి వివాహ వార్త వెలువడటంతో అభిమానులు, రాజకీయ నాయకులు, నెటిజన్ల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

కుటుంబాల సమక్షంలో వేడుక

కుటుంబ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెలలోనే శ్రీనగర్‌లో అబ్దుల్లా, రజ్దాన్ కుటుంబాలు ప్రత్యేకంగా సమావేశమై వేడుక నిర్వహించాయి. అనంతరం ఢిల్లీలో వివాహాన్ని అధికారికంగా నమోదు చేయించారు. జమ్మూకశ్మీర్‌లో అధికారిక కార్యక్రమాలతో పాటు పలుచోట్ల ఒమర్ అబ్దుల్లా, నిధి రజ్దాన్ కలిసి కనిపించడంతో వీరి పరిచయం గురించి గతంలోనే చర్చ జరిగింది. నేషనల్ కాన్ఫరెన్స్ అధికార ప్రతినిధి ఇమ్రాన్ నబీ దార్ ఈ జంటకు అభినందనలు తెలిపారు. కొత్త జీవితంలో అడుగుపెట్టిన ఇద్దరికీ జీవితాంతం సంతోషం, అనుబంధం ఉండాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత జీవితంలో కొత్త మలుపు తీసుకున్న ముఖ్యమంత్రికి రాజకీయ వర్గాల నుంచి కూడా శుభాకాంక్షలు అందుతున్నాయి.

విడాకులతో వివాదానికి తెర

ఒమర్ అబ్దుల్లా రెండో వివాహం వెనుక ఆయన వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలు కూడా చర్చకు వస్తున్నాయి. 1994లో మేజర్ జనరల్ రామ్‌నాథ్ కుమార్తె పాయల్ నాథ్‌ను ఆయన వివాహం చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే జరిగిన ఈ పెళ్లి బంధానికి 2011లో ఇద్దరూ విడిపోయారు. విడాకుల వ్యవహారంపై సుదీర్ఘ న్యాయపోరాటం కొనసాగింది. చివరకు 2026 జూలై 31న సుప్రీంకోర్టులో పరస్పర అంగీకారంతో విడాకుల పరిష్కారం కుదిరింది. ఆ పరిణామం జరిగిన మూడు నెలలకే నిధి రజ్దాన్‌తో ఒమర్ కొత్త వైవాహిక జీవితాన్ని ప్రారంభించారు. రాజకీయ బాధ్యతల మధ్య వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.

2024 ఎన్నికల్లో అక్రమాలు

13.3 కోట్ల ఓట్ల తొలగించారు.. ఎన్నిక చెల్లుబాటు కాదు



ఈసీపై రాహుల్ ఆరోపణలు

దేశ రాజకీయాల్లో ఎన్నికల సంఘం వ్యవహారం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి చేపట్టిన మాక్ ప్రజాభిశంసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించడం ప్రజాస్వామ్య ప్రక్రియ విశ్వసనీయతను దెబ్బతీసిందని అన్నారు. ప్రతిపక్ష కూటమికి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మధ్య నమోదైన ఓట్ల తేడా కంటే తొలగించిన ఓటర్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ తొలగింపుల ప్రభావంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

ఆరు అభియోగాలు.. ఈసీపై ఆగ్రహం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్ కుమార్‌పై ఆరు ప్రధాన ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడం, 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించడం, పార్లమెంట్ పర్యవేక్షణ లేకుండా ఫామ్ 6 నిబంధనలు మార్చడం వాటిలో ముఖ్యమైనవి. ఈసీనెట్ ద్వారా ఓటర్ల జాబితాలపై నియంత్రణ సాధించడం, మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కీలక నిర్ణయాలకు దూరంగా ఉంచడం, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించడం కూడా ఆరోపణల్లో ఉన్నాయి. ఈసీ స్వతంత్రతను కాపాడాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది.

నేడు రాంలీలా మైదానంలో రణభేరి

ప్రతీకాత్మక ప్రజాభిశంసన కార్యక్రమానికి మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. నేడు ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభకు ఇండియా కూటమి సిద్ధమైంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓట్ల చోరీకి అడ్డుకట్ట, రాజ్యాంగ రక్షణ లక్ష్యాలుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాహుల్ ప్రకటించారు. అభిజీత్ దీపక్కే స్థాపించిన క్రాంతి జనతా పార్టీ (సీజేపీ) కూడా ఈ సభకు మద్దతు ప్రకటించింది. ఎన్నికల సంఘంపై విపక్షాల పోరాటం ఇప్పుడు దేశవ్యాప్త రాజకీయ చర్చగా మారుతోంది.



రాచమల్లుతో విభేదాలు లేవు.. ఐక్యతను దెబ్బతీయలేరు

ప్రొద్దుటూరులో వైసీపీ నేతల మధ్య విభేదాలున్నాయంటూ ఎమ్మెల్యే సంద్యాల వరదరాజులరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఆ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఖండించారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, తమ ఐక్యతను విడదీయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రాచమల్లు తన పేరును ప్రకటించారని గుర్తుచేశారు. ఓసీ అభ్యర్థిగా తనకు, ఓసీ మహిళకు అవకాశం వస్తే రాచమల్లు రామదేవికి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపారు. టీడీపీ సంద్యాల రాఘవరెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో, ఈ నెల 18న వైసీపీ నామినేషన్ల సమయంలో పోలీసులు తనను అడ్డుకున్నారని ఆరోపించారు.

జమ్మలమడుగు ఎన్నికల పరిశీలకుడిగా ఉన్ననే కారణంతో నామినేషన్ వేయనివ్వలేదని, వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులకూ ఇబ్బందులు కల్పించారని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు వ్యవహరించారని ఆరోపిస్తూ, తమ మధ్య విభేదాలంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మరని పోరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత ఆర్టీసీ ఎన్నికలు



సహకార సంఘానికి కొత్త పాలకమండలి అభివృద్ధి

ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని 76 ఏళ్ల చరిత్ర కలిగిన ది ప్రొద్దుటూరు కోఆపరేటివ్ సొసైటీకి కొత్త పాలకమండలి బాధ్యతలు చేపట్టింది. శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా ఓబుళరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సుమారు 12 వేల మంది సభ్యులతో మూడు కాలనీలను ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఇటీవల అవకతవకల కారణంగా అభివృద్ధిలో వెనుకబడిందని మున్సిపల్ చైర్మన్ సంద్యాల రాఘవరెడ్డి పేర్కొన్నారు. కొత్త కమిటీ సంస్థను తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఓబుళరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో నూతన కమిటీ ఏర్పాటైందన్నారు. మాన్యువల్ ఖాతాల కంప్యూటరీకరణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మొండి బకాయిల వసూలు తమ ప్రాధాన్యాలని తెలిపారు. బైలాలో అవసరమైన మార్పులు చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మార్కెట్ యార్డు ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

పులివెందులలో అవినాష్ రెడ్డి పూజలు

ప్రొద్దుటూరులో అయ్యప్ప భక్తులకు తులాభారం సేవలు పెన్నానది తీరంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో నేటి నుంచి భక్తులకు తులాభారం సేవ అందుబాటులోకి రానుంది. ఆదివారం ఉదయం 9.15 గంటలకు ఈ సేవను ప్రారంభించనున్నారు. భక్తులు తమ మొక్కుల ప్రకారం బియ్యం, నాణేలు, పంచదార, బెల్లం, నెయ్యి, శెనగలు, బొబ్బర్లు సమర్పించుకోవచ్చు. బియ్యంతో ధన ధాన్యాలు, వ్యాపారాభివృద్ధి, నాణేలు సమర్పిస్తే అప్పుల బాధల నుంచి విముక్తి, పంచదారతో సంతోషకరమైన జీవితం, బెల్లంతో ఆరోగ్య ఉపశమనం, నెయ్యితో దోష నివారణ, శెనగలు, బొబ్బర్లతో విద్యాభివృద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సేవకు వారం, తిథి, నక్షత్రాలతో సంబంధం లేదని, ఏ రోజైనా తులాభారం నిర్వహించుకోవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీ అమ్మత్వేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆహ్వానించారు.



ఏపీ స్థానిక ఎన్నికలు...

సీసీ కెమెరాలు తప్పనిసరి!



ఎన్నికల వివాదాలకు వీడియోలే కీలకం

ప్రతి దశలోనూ కెమెరాల నిఘా: సుప్రీం కోర్టు

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు సీసీ కెమెరాలు లేదా వీడియో రికార్డింగ్ తప్పనిసరి చేసింది. అక్టోబర్ 27న వెలువరించిన తుది ఉత్తర్వుల్లో ఈ ఆదేశాలను స్పష్టం చేసింది. నామినేషన్లు స్వీకరించే కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వీడియో నిఘా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల సమయంలో జరిగే అవకతవకలు, వివాదాలకు సంబంధించిన ఆధారాలు భద్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది.

ఎన్నికల పిటిషన్ల పరిష్కారం వరకు ఫుటేజీ భద్రం

సీసీ కెమెరాల ద్వారా సేకరించిన దృశ్యాలను ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసేందుకు నిర్ణయించిన గడువు ముగిసే వరకు భద్రపరచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల పిటిషన్ దాఖలైతే, సంబంధిత కేసు తుది పరిష్కారం అయ్యే వరకు వీడియోలను తొలగించకూడదు. ఎన్నికల ట్రిబ్యునల్ కోరినప్పుడు సంబంధిత ఫుటేజీని అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. నామినేషన్ల తిరస్కరణ, పోలింగ్‌లో అక్రమాలు, ఓట్ల లెక్కింపులో అవకతవకలకు సంబంధించిన వివాదాల్లో ఈ వీడియోలు కీలక ఆధారాలుగా ఉపయోగపడనున్నాయి.

అభ్యర్థులకు పోలీసు భద్రత కల్పించాలి

వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు ఎలాంటి అడ్డంకులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా తగిన పోలీసు భద్రత కల్పించాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థనను కోర్టు అంగీకరించలేదు. తాజా ఆదేశాలతో రాష్ట్రంలోని స్థానిక ఎన్నికల్లో భద్రత, పారదర్శకతకు సంబంధించిన పర్యవేక్షణ మరింత కీలకంగా మారింది.

మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు తిప్పలు!

ఓటరు స్లిప్పుల పంపిణీలో జాప్యం

పోలింగ్ శాతంపై రాజకీయ పార్టీల్లో టెన్షన్!

ఏర్పాట్లు ఘనం..

ఓటర్లకు మాత్రం ఇబ్బందులు!



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు చివరి నిమిషం వరకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల పరిశీలకులు ఏర్పాట్లను పర్యవేక్షించినా వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదు.

ఈసారి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రభావంతో అనేక ప్రాంతాల్లో ఓట్లు గల్లంతవడం, నియోజకవర్గాలు మారడం, ఓటర్ల జాబితాల్లో తప్పులు దొర్లడం వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. గతంలో రాజకీయ పార్టీల కార్యకర్తలు, స్థానిక నాయకులు ఓటర్ల జాబితాలను పరిశీలించి స్లిప్పులు అందించేవారు. ఈసారి సచివాలయ సిబ్బందికి ఆ బాధ్యత అప్పగించడంతో వేలాది ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం కష్టంగా మారింది.

తుఫాను దెబ్బ.. పోలింగ్‌పై ప్రభావం!

మరోవైపు మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన అర్నబ్ తుఫాను ఎన్నికల ఏర్పాట్లకు ఆటంకంగా మారింది. పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికి కూడా అనేక ప్రాంతాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి కాక పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓటర్ల జాబితాలో పేరున్నప్పటికీ స్లిప్పులు అందకపోవడంతో కొందరు ఓటు వేయడానికి ఆసక్తి చూపకపోవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల ఓటర్లు పోలింగ్‌కు దూరమయ్యే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఓటింగ్ శాతం తగ్గితే అభ్యర్థుల విజయావకాశాలే తారుమారయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. ఎన్నికల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశామని ప్రకటించిన అధికార యంత్రాంగం, చివరి దశలో ఓటర్లకు అవసరమైన స్లిప్పులు అందించడంలో ఎందుకు వెనుకబడిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ గందరగోళం ఏ పార్టీకి లాభం చేకూరుస్తుంది? ఏ అభ్యర్థి విజయావకాశాలను దెబ్బతీస్తుంది? పోలింగ్ ముగిసిన తర్వాతే అసలు ప్రభావం స్పష్టమవుతుంది.

నేడు ఓటర్ల తీర్పు!

జీవీఎంసీ ఎన్నికలకు భారీ ఏర్పాట్లు

120 వార్డులు, 1,990 పోలింగ్ కేంద్రాలు

18.37 లక్షల మంది ఓటర్లు..

సర్వం సిద్ధం



గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. నగరంలోని 10 జోన్ల పరిధిలో 120 వార్డులకు 1,990 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 18,37,901 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 4,378 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. 14,334 మంది పోలింగ్ సిబ్బందిని విధుల్లో నియమించారు. వీరితో పాటు 82 మంది రిటర్నింగ్ అధికారులు, 201 మంది రూట్ అధికారులు సహా వివిధ స్థాయిల్లో ప్రత్యేక బృందాలు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జీవీఎంసీ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

బరిలో 588 మంది అభ్యర్థులు..

భారీ ఏర్పాట్లు

పోలింగ్ కు అవసరమైన ఎన్నికల సామగ్రిని ఇప్పటికే పది జోన్లలోని ప్రత్యేక పంపిణీ కేంద్రాల నుంచి సిబ్బందికి అందించారు. వారికి శిక్షణ ఇచ్చి ప్రత్యేక బస్సుల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి ఇంటికీ ఓటరు సమాచార స్లిప్పులు చేరేలా చర్యలు చేపట్టారు. మేయర్ పదవికి 15 మంది, 120 వార్డుల సభ్యుల స్థానాలకు 573 మంది.. మొత్తం 588 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీలో ప్రజాస్వామ్యానికి పరీక్ష

నామినేషన్ల దశలోనే అక్రమాలు?

ఎన్నికల ప్రక్రియపై వైఎస్ జగన్ ఆరోపణలు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలోనే అధికార దుర్వినియోగం జరిగిందని విమర్శించారు. వైసీపీ ముఖ్య నాయకులను గృహనిర్బంధంలో ఉంచడం, బైండోవర్ కేసులు పెట్టడం ద్వారా అభ్యర్థులకు మద్దతుగా వెళ్లకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. మరోవైపు టీడీపీ శ్రేణులకు నామినేషన్ కేంద్రాల వద్ద స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, నామినేషన్ పత్రాలను చించివేశారని, మహిళా అభ్యర్థులనూ వదల్లేదని తన పోస్టులో వివరించారు.

నకిలీ నామినేషన్లు.. బలవంతపు ఉపసంహరణలు

వైసీపీ పేరుతో టీడీపీ సానుభూతిపరులు కొందరు నకిలీ నామినేషన్లు దాఖలు చేశారని జగన్ ఆరోపించారు. అసలైన అభ్యర్థులను అడ్డుకుంటూనే, ప్రత్యర్థి పార్టీకి అవకాశం ఇచ్చినట్లు చూపించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులను బెదిరించి ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేశారని, నిరాకరించిన వారి పత్రాలను సాకులు చూపి తిరస్కరించారని ఆరోపించారు. పత్రాలు మాయం చేయడం, సంతకాలు ఫోర్జరీ చేసి ఉపసంహరణలు చూపించడం వంటి అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు.

ఎన్నికల యంత్రాంగంపై ప్రశ్నలు

పోలీసులు, రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించలేదని జగన్ విమర్శించారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి, నామినేషన్ పత్రాలు, పరిశీలన రికార్డులు, ఉపసంహరణ దరఖాస్తులు, వీడియో దృశ్యాలను భద్రపరచాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు స్వతంత్ర పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. రేపు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల హక్కులు, ఓటర్ల స్వేచ్ఛను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.

కాక రేపుతున్న జగన్ రాక!



ఓటు వేసి ఇంటికి వెళ్లాల్సిందే!
జగన్ అయినా.. మరెవరైనా..
చట్టం ముందు అందరూ సమానమే!
డీఐజీ ప్రకటనతో పులివెందులలో హైఅలర్ట్!

పులివెందులలో రాజకీయం రగులుతోంది. పోలింగ్ వేళ అసలేం జరగబోతోంది? మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. గతంలో చొక్కా మడతపెట్టి చేసిన సవాల్‌కు ఇప్పుడు పోలీసు శాఖ తనదైన శైలిలో సమాధానం ఇచ్చింది. వస్తే రావచ్చు.. ఓటు వేయొచ్చు.. కానీ ఓటు వేసిన వెంటనే ఇంటికి వెళ్లాల్సిందే! అంటూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేసిన ప్రకటన రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. జగన్ అయినా.. మరెవరైనా.. చట్టం ముందు అందరూ సమానమేనన్న సంకేతాలు పంపింది. మరోవైపు పులివెందుల చుట్టూ పోలీసుల భారీ బందోబస్తు.. మూడు వేల మంది సిబ్బంది మోహరింపు..పట్టణంలోకి వచ్చే 17 మార్గాల్లో తనిఖీలు.. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా! అటు పోలీసులపై వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు.. ఇటు అధికారుల సమాధానాలు! ఈ పరిణామాల మధ్య బాకరాపురం పోలింగ్ కేంద్రానికి జగన్ రాక ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఓటు వేసి వెనుదిరుగుతారా? లేక రాజకీయ సవాల్‌కు మరో రూపం ఇస్తారా? పులివెందులలో జరగబోయేది సాధారణ పోలింగేనా? రాజకీయ ప్రతిష్ఠకు పరీక్షా? మాటల యుద్ధానికి తెరపడేది ఎప్పుడు? అసలు పరీక్ష మొదలయ్యేది ఇప్పుడు!



పెళ్లి వేదిక మార్చిన షర్మిల

యెలహంక నుంచి మరో చోట పెళ్లి


బెంగళూరులోని యెలహంక ఇంట్లో జరగాల్సిన తన కుమార్తె అంజలి రెడ్డి వివాహ వేడుకను మరో వేదికకు మార్చుతున్నట్లు వైఎస్ షర్మిల ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా తన నిర్ణయాన్ని వెల్లడించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వరకు ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ఉన్న యెలహంక నివాసం, ఆస్తుల విభజనలో తనకు, తన పిల్లలకు పూర్తిగా కేటాయించబడిందని స్పష్టం చేశారు. ఆ ఇంటిపై తమకు 100 శాతం హక్కు ఉందని దేవుడి సాక్షిగా చెబుతున్నానని పేర్కొన్నారు.

తండ్రి జ్ఞాపకాలతో ముడిపడిన ఇల్లు

యెలహంక నివాసం కేవలం ఆస్తి మాత్రమే కాదని, ఎన్నో కుటుంబ జ్ఞాపకాలతో ముడిపడి ఉందని షర్మిల వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా ఆ ఇంట్లో నివసించారని గుర్తుచేశారు. తన కుమార్తె అంజలి రెడ్డి బాల్యం గడిచిన అదే ఇంట్లో ఆమె వివాహం జరిపించాలన్నది తన కోరిక అని తెలిపారు. ప్రతి తల్లిదండ్రికి తమ సొంత ఇంట్లో పిల్లల పెళ్లి చేయాలన్నది ఎంతో ప్రత్యేకమైన ఆశ అని, అలాంటి కోరికను నెరవేర్చలేక పోతున్నందుకు బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇంటితో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని కూడా ఆమె తన ప్రకటనలో ప్రస్తావించారు.

వివాదాలకు దూరంగా.. మరో వేదికపై పెళ్లి

అంజలి రెడ్డి వివాహం సోమల రఘురామ్ రెడ్డితో పెద్దలు కుదిర్చిన సంబంధమని షర్మిల వెల్లడించారు. జీవితంలో ఎంతో ముఖ్యమైన ఈ వేడుక ఎలాంటి వివాదాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరగాల్సిన బాధ్యత కుటుంబంపై ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు పెళ్లి వేడుకపై ప్రభావం చూపకూడదనే ఉద్దేశంతోనే యెలహంక ఇంటిని వదిలి మరో వేదికను ఎంచుకున్నట్లు ప్రకటించారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో వివాహాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సొంత ఇంట్లో కూతురి పెళ్లి జరపాలన్న తల్లి కోరికకు ఆస్తి వివాదం అడ్డుపడటంతో షర్మిల తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



కబ్జా ఆస్తి.. సుప్రీం శాస్తి

నవాబుల ఆస్తులపై రుబాబు

ఒకప్పుడు నవాబుల చేతుల్లో ఉన్న భూములు.. ఆ తర్వాత ప్రభుత్వ ఖజానాలోకి చేరిన ఆస్తులు.. కాలం మారింది.. హైదరాబాద్ రూపురేఖలు మారాయి.. భూముల ధరలు కోట్లకు చేరాయి.. అంతే! ప్రభుత్వ భూములపై ప్రైవేటు హక్కుల వేట మొదలైంది. పాత ఫర్మానాలు తెరపైకి వచ్చాయి.. వారసత్వ హక్కుల వాదనలు వినిపించాయి.. పహాణీల్లో పేర్లు ప్రత్యక్షమయ్యాయి.. అధికారుల సహకారంతో రెవెన్యూ రికార్డులు మారాయన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఏకంగా 550 ఎకరాల 39 గుంటల విలువైన భూములపై హక్కుల కోసం సాగిన ఈ పోరాటంలో అసలు గుట్టును సుప్రీంకోర్టు రట్టు చేసింది. 1912లోనే ప్రభుత్వ పోరంబోకుగా నమోదైన భూములు.. 1949లో జాగీర్ల రద్దుతో ప్రభుత్వానికి సంక్రమించిన ఆస్తులని తేల్చింది. జాగీర్దారులకు ఉన్నది ఆదాయ హక్కులే తప్ప యాజమాన్యం కాదని స్పష్టం చేసింది. నకిలీ రెవెన్యూ నమోదులు, అధికార పరిధి లేని అనుమతులు, నిరూపణ కాని వీలునామాలతో ప్రభుత్వ ఆస్తులను సొంతం చేసుకునే ప్రయత్నాలను తప్పబట్టింది. ఒక్కో పత్రాన్ని పరిశీలించింది.. ఒక్కో వాదనను ప్రశ్నించింది.. చివరకు ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లన్నింటికీ చెల్లుచీటి రాసింది. భూమి ప్రభుత్వానిదే.. హక్కు ప్రభుత్వానిదే.. మోసపూరిత వాదనలకు న్యాయస్థానంలో స్థానం లేదని 550 ఎకరాల వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్పష్టం చేసింది! ఈ భూవివాదం వెనుక వందేళ్ల చరిత్ర.. తెరపైకి వచ్చిన సంచలన అంశాలేమిటి?

- సుప్రీం తీర్పుతో ప్రభుత్వం జవాబు
- పొజిషన్ పేరుతో ప్రైవేట్ వ్యక్తుల దందా
- న్యాయస్థానం ఆదేశాలతో కబ్జా ఆస్తులు గోవిందా
- మియాపూర్ భూదందాపై నా దేశం ఇన్‌డెప్త్ అనాలసిస్

నవాబుల కాలం నాటి జాగీర్ హక్కులు చెల్లవు.. 1949లోనే ప్రభుత్వానికి భూముల బదలాయింపు.. తప్పుడు రెవెన్యూ రికార్డులు, అధికారుల కుమ్మక్కుతో వందల ఎకరాల ప్రభుత్వ భూములను సొంతం చేసుకునే ప్రయత్నాలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. చట్టవిరుద్ధమైన పట్టాదారు నమోదులు, ప్రైవేటు యాజమాన్య వాదనలను తిరస్కరిస్తూ మియాపూర్ భూముల దశాబ్దాల వివాదానికి తెరదించింది. 550 ఎకరాల 39 గుంటల భూమిపై తెలంగాణ ప్రభుత్వానికే సంపూర్ణ యాజమాన్య హక్కులు ఉన్నాయని 2026 అక్టోబర్ 29న తీర్పు వెలువరించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ నరసింహ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేస్తూ, 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జాగీర్దార్లకు గతంలో ఉన్నవి భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కాకుండా పరిమిత ఆదాయ హక్కు లేనని స్పష్టం చేసింది. 1949లో జాగీర్ల రద్దు చట్టం అమల్లోకి రావడంతో వారి అధికారాలు ముగిశాయని పేర్కొంది. ప్రభుత్వ భూములను ప్రైవేటు ఆస్తులుగా మార్చేందుకు నకిలీ రెవెన్యూ రికార్డులు సృష్టించడం, అధికారుల సహకారంతో పట్టాదారు పేర్లు నమోదు చేయించడం చట్టబద్ధం కాదని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు పథకం ప్రకారం ప్రయత్నాలు జరిగినట్లు అభిప్రాయపడింది. దీంతో విలువైన మియాపూర్ భూములపై ప్రభుత్వ హక్కులు మరోసారి బలపడ్డాయి.

• 1912 సర్వేలోనే ప్రభుత్వ భూములుగా నమోదు

మియాపూర్ భూముల వివాదానికి పందేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. 1912లో నిర్వహించిన గ్రామ సర్వేలో 550 ఎకరాల 39 గుంటల భూమిని సర్కారీ పోరంబోకుగా నమోదు చేశారు. అయితే తర్వాత కాలంలో పాత పాలకుల నుంచి తమకు హక్కులు సంక్రమించాయని పేర్కొంటూ మూడు వర్గాలు యాజమాన్యాన్ని కోరాయి. మొదటి వర్గం నవాబ్ రఫీ ఉన్ నిసా బేగం కుమారుడు నవాబ్ మహమ్మద్ ఖైసరుద్దీన్ ఖాన్ ద్వారా హక్కులు వచ్చాయని, 1927లో రీలీ కమిషన్ మియాపూర్ సహా ఇతర గ్రామాలను తిరిగి అప్పగించాలని సిఫారసు చేసిందని వాదించింది. రెండో వర్గం అబ్దుల్ సలాం భార్య రహీమున్నీసా బేగం పేరును 195051 నుంచి 195253 వరకు పహాణీలలో పట్టాదారుగా నమోదు చేశారని పేర్కొంది. మూడో వర్గం నవాబ్ మొయినుద్దౌలా బహదూర్ భార్య రహీమున్నీసా బేగం ద్వారా హక్కులు సంక్రమించాయని, 1929 ఫర్మానాను ఆధారంగా చూపించింది. ఇలా వేర్వేరు చారిత్రక పత్రాలతో హక్కులు కోరినప్పటికీ, పాత రికార్డుల్లో పేర్లు ఉన్నంత మాత్రాన యాజమాన్యం నిర్ధారణ కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1912లో ప్రభుత్వ భూములుగా నమోదైన ఆస్తులను ప్రైవేటు భూములుగా మార్చేందుకు చట్టబద్ధమైన బదలాయింపు ఉత్తర్వులు తప్పనిసరని పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదైనంత మాత్రాన హక్కులు సంక్రమించవని, ఆ నమోదు ఏ అధికారం కింద జరిగిందో నిరూపించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. అయితే అప్పీలుదారులు ఇందుకు అవసరమైన ఆధారాలను సమర్పించ లేకపోయారు. పాత పహాణీలు, ఫర్మానాలు చూపించి ప్రభుత్వ భూములపై ప్రైవేటు యాజమాన్య హక్కులు పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది.

• 1949 జాగీర్ల రద్దుతో ముగిసిన పాత హక్కులు

1949లో అమల్లోకి వచ్చిన జాగీర్ల రద్దు చట్టం మియాపూర్ భూముల వివాదంలో కీలక మలుపుగా మారింది. అప్పటి హైదరాబాద్ సంస్థానంలో జాగీర్దార్లకు భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొందే హక్కులు మాత్రమే ఉండేవని, అవి సంపూర్ణ యాజమాన్యానికి సమానం కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రాంత జాగీర్ల రద్దు నియంత్రణ చట్టం 1358 ఫస్లీ 1949 ఆగస్టు 15 నుంచి అమల్లోకి రాగా, అదే ఏడాది సెప్టెంబర్ 15 నుంచి జాగీర్ల పరిపాలన హైదరాబాద్ ప్రభుత్వానికి బదిలీ అయింది. దీంతో జాగీర్దార్ల అధికారాలు, హక్కులు, బాధ్యతలు ముగిశాయి. జాగీర్దారు హోదా కూడా వారసులకు స్వయంచాలకంగా సంక్రమించదని, అది నిజాం నిర్ణయంపై ఆధారపడి ఉండేదని ధర్మాసనం వివరించింది. జాగీర్ రద్దు తర్వాత ఖైసరుద్దీన్ ఖాన్ హైదరాబాద్ అతియత్ విచారణ చట్టం కింద పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1957, 1958 సంవత్సరాల్లో తాత్కాలిక, సవరించిన పరిహార నిర్ణయాలు జారీ అయ్యాయి. అనంతరం 1976లో రెవెన్యూ బోర్డు మియాపూర్ సహా నాలుగు గ్రామాలకు ముంతఖబ్ మంజూరు చేసింది. అయితే అది భూములపై యాజమాన్య హక్కులు కల్పించదని, జాగీర్ల రద్దుకు ప్రతిఫలంగా ఇచ్చే ఒకేసారి పరిహారం మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పరిహారం పొందిన తర్వాత మళ్లీ అదే భూములపై హక్కులు కోరడం చెల్లదని పేర్కొంది. ఖైసరుద్దీన్ ఖాన్ కుమారుడు భూములను తిరిగి అప్పగించాలని 1995లో దాఖలు చేసిన దరఖాస్తు కూడా తిరస్కరణకు గురైంది. ఆ నిర్ణయాన్ని సవాలు చేయకపోవడం వారి వాదనలకు ప్రతికూలంగా మారిందని ధర్మాసనం గుర్తించింది. 1949లోనే జాగీర్ హక్కులు ముగిశాయని, పరిహారం పొందినంత మాత్రాన భూముల యాజమాన్యం తిరిగి రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

• తప్పుడు పట్టాదారు నమోదులు.. అధికారుల పాత్రపై తీవ్ర వ్యాఖ్యలు

మియాపూర్ భూముల వివాదంలో రెవెన్యూ రికార్డుల తారుమారు కీలక అంశంగా మారింది. ప్రభుత్వ భూములుగా నమోదైన ఆస్తుల్లో అబ్దుల్ సలాం భార్య రహీమున్నీసా బేగం పేరు పట్టాదారుగా కనిపించడంపై సుప్రీంకోర్టు అనుమానాలు వ్యక్తం చేసింది. 195455 ఖస్రా పహాణీలలో డొంగల గుట్ట కంచ పోరంబోకుగా నమోదైన భూమి ఆమె పేరుపైకి ఎలా మారిందని ప్రశ్నించింది. సర్వేనంబర్లు 100, 101కు సంబంధించి ఫైసల్ పట్టీ, పక్కా పుస్తకాల్లో ప్రభుత్వ భూమి బదలాయింపునకు ఎలాంటి ఉత్తర్వులు లేవని గుర్తించింది. పట్టాదారు మార్పునకు అవసరమైన నిబంధనలు పాటించలేదని మండల రెవెన్యూ అధికారి సాక్ష్యం ద్వారా వెల్లడైందని పేర్కొంది. కేవలం రికార్డుల్లో పేరు నమోదు చేసినంత మాత్రాన యాజమాన్య హక్కులు రావని స్పష్టం చేసింది. 1995 అక్టోబర్‌లో మండల రెవెన్యూ అధికారి చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో భూమి రాళ్లతో నిండిన బీడుగా ఉందని, వ్యవసాయ కార్యకలాపాలు లేదా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నట్లు ఎలాంటి ఆసవాళ్లు లేవని గుర్తించారు. ఈ ఆధారాలను పరిశీలించిన ధర్మాసనం రహీమున్నీసా బేగం పేరుతో ఉన్న నమోదులు నిజమైనవి కావని, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మోసపూరితంగా సృష్టించారని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వానికి తెలియకుండా, జాగీర్ అడ్మినిస్ట్రేటర్ అనుమతి లేకుండా జరిగిన ఈ నమోదులు చట్టవిరుద్ధమని పేర్కొంది. అధికారిక బదలాయింపు ఉత్తర్వులు లేకుండా ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేర్లపై నమోదు చేయడం చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

• 140 ఎకరాల బదలాయింపు నుంచి వేలెత్తిన ప్రశ్నలు

మియాపూర్ భూముల వ్యవహారంలో 140 ఎకరాల విక్రయ అనుమతులపై కూడా సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ టెనెన్సీ చట్టం కింద తహసీల్దార్ జారీ చేసిన అనుమతులు చెల్లవని ప్రకటించింది. జాగీర్ల రద్దు చట్టం, అతియత్ విచారణల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో పాటు జాగీర్ అడ్మినిస్ట్రేటర్, ఖైసరుద్దీన్ ఖాన్‌లకు వాదనలు వినిపించే అవకాశం కల్పించలేదని గుర్తించింది. అధికార పరిధి లేకుండా ఇచ్చిన అనుమతులకు చట్టబద్ధత ఉండదని స్పష్టం చేసింది. గతంలో భూములను ప్రైవేటు ఆస్తిగా పరిగణిస్తూ చేపట్టిన భూసేకరణ ప్రక్రియను హైకోర్టు రద్దు చేసినప్పటికీ, అందులో ప్రభుత్వ యాజమాన్యం పై తుది నిర్ణయం వెలువడలేదని, అందువల్ల ఆ ప్రక్రియ ప్రభుత్వ హక్కులను దెబ్బతీయదని పేర్కొంది. శాసనసభ హౌస్ కమిటీ నివేదిక కూడా ఎవరికీ యాజమాన్య హక్కులు కల్పించదని తేల్చింది. మరోవైపు, 1918లో బాసిత్ ఖాన్ వేలంలో భూమిని కొనుగోలు చేసి, 194344 మధ్య వీలునామా ద్వారా తమ పూర్వీకురాలికి బదిలీ చేశారని అప్పీలుదారులు సుప్రీంకోర్టులో తొలిసారిగా వాదించారు. అయితే ప్రత్యేక న్యాయస్థానం, హైకోర్టు విచారణల్లో ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. సమర్పించిన పత్రాల ప్రామాణికత, చెల్లుబాటు నిరూపించలేదని, గతంలో రీలీ కమిషన్ నివేదికతో సహా ఏ అధికారిక విచారణలోనూ వేలం, వీలునామా ప్రస్తావన లేదని గుర్తించింది. జాత్ జాగీర్ కింద వ్యక్తిగత ఆస్తిగా మినహాయింపు పొందినట్లు నిరూపించే ఆధారాలు కూడా లేవని పేర్కొంది. అధికార పరిధి లేని అనుమతులు, నిరూపణ కాని వీలునామాలు, హౌస్ కమిటీ నివేదికలు భూములపై యాజమాన్య హక్కులకు ఆధారాలు కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

• భూకబ్జా ప్రయత్నాలకు సుప్రీంకోర్టు గట్టి అడ్డుకట్ట

మియాపూర్ భూముల వివాదంలో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను కూడా సుప్రీంకోర్టు పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ భూకబ్జాల నిరోధక చట్టం 1982 కింద విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం కొన్ని కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చకుండానే తీర్పులు ఇచ్చింది. మరికొన్ని కేసుల్లో ప్రభుత్వం భాగస్వామిగా ఉన్నప్పుడు భూములను ప్రభుత్వ పోరంబోకు ఆస్తులుగా గుర్తించి, ప్రైవేటు వ్యక్తులను భూకబ్జాదారులుగా ప్రకటించింది. ఈ తీర్పులను పరిశీలించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చని కేసుల నిర్ణయాలను పక్కనపెట్టి, మిగిలిన తీర్పులను సమర్థించింది. మియాపూర్ భూములకు తెలంగాణ ప్రభుత్వమే యజమాని అని ప్రకటించింది. దీనిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చకపోవడం వల్ల ఏర్పడిన లోపాన్ని హైకోర్టు సరిదిద్దిందని పేర్కొంది. ముఖ్యంగా 1994లో ఎల్‌జీసీ 21, 22 కేసుల్లో వెలువడిన తీర్పులు ప్రభుత్వ యాజమాన్య హక్కులపై ప్రభావం చూపవని తేల్చింది. ఈ భూములను హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేసిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. అప్పీలుదారులకు భూములపై చట్టబద్ధమైన హక్కులే లేనప్పుడు ప్రత్యేక ఉపశమనం కల్పించే అవకాశం లేదని పేర్కొంది. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు మోసపూరిత ప్రయత్నాలు జరిగాయని అభిప్రాయపడుతూ, ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లన్నింటినీ కొట్టివేసింది. దీంతో 550 ఎకరాల 39 గుంటల మియాపూర్ భూములపై తెలంగాణ ప్రభుత్వ యాజమాన్య హక్కులు మరోసారి బలపడ్డాయి. జాగీర్ల రద్దు, తప్పుడు రెవెన్యూ నమోదులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన దశాబ్దాల వివాదానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన ముగింపు లభించింది.

- తోకల సుధాకర్ పటేల్,





జగన్ రాక.. మొదలైన కాక

- జగన్ ఎంట్రీతో హడావుడి స్టార్ట్
- పులివెందులలో పోలీసులు హై అలర్ట్
- ఓటేసి సైలెంట్‌గా వెళ్లాలన్న ఐజీ
- రాజకీయ వ్యూహాల్లో వైసీపీ అధినేత బిజీ



పులివెందుల మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలింగ్‌కు కొన్ని గంటల ముందు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులకు వస్తానని ప్రకటించడం, మరోవైపు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. జగన్ రాకపై ఆసక్తి పెరుగుతున్న సమయంలో పోలీసు శాఖ విధించిన పరిమితులు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓటు వేయడానికి జగన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని, అయితే ఓటు వేసిన వెంటనే నేరుగా ఇంటికి వెళ్లాలని డీఐజీ స్పష్టం చేశారు. పులివెందుల పట్టణంలో ఇతర ప్రాంతాల్లో తిరిగేందుకు అనుమతి ఉండదని తేల్చిచెప్పారు. దీంతో ఆయన పర్యటన ఎలా సాగుతుందన్న ఉత్కంఠ నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధినేత తన సొంత నియోజకవర్గానికి ఓటు వేయడానికి వస్తుండటంతో అందరి దృష్టి పులివెందులపై పడింది. ఒకవైపు జగన్ తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి సిద్ధమవుతుండగా, మరోవైపు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నారు. జగన్ ఓటు వేసిన తర్వాత ఇంటికే పరిమితమవుతారా? పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఎన్నికల నియమావళి అమలులో అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని పోలీసు శాఖ స్పష్టం చేస్తోంది. ఓటు హక్కుకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనలకు నిబంధనలు వర్తిస్తాయన్నది డీఐజీ ప్రకటనలోని ప్రధాన అంశం. దీంతో జగన్ రాక ఎన్నికల నిర్వహణ, పోలీసుల ఆంక్షలు, రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న వివాదాలకు కేంద్రబిందువుగా మారింది.

బాకరాపురం పోలింగ్ కేంద్రంపై అందరి చూపు

ఇప్పుడు అందరి దృష్టి నవంబర్ 1వ తేదీ ఉదయం పులివెందులలో చోటుచేసుకునే పరిణామాలపైనే కేంద్రీకృతమైంది. జగన్ బాకరాపురం పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయన రాకకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రం వద్ద భద్రత, ఓటు వేసిన తర్వాత తీసుకునే నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పోలీసుల సూచనలను పాటించి నేరుగా ఇంటికి వెళ్తారా? పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారా? నిర్ణీత పరిమితుల్లోనే తన పర్యటనను ముగిస్తారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారాన్ని వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన పోరాటంగా మార్చడం కంటే ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగడమే ముఖ్యం. జగన్ తన ఓటు హక్కును వినియోగించుకోవాలి. పోలీసులు తమకు అప్పగించిన భద్రతా బాధ్యతలను నిబంధనల ప్రకారం నిర్వర్తించాలి. ఇతర రాజకీయ నాయకులు కూడా ఎన్నికల నియమావళిని పాటించాలి. సాధారణ ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు వేయాలి. పులివెందులలో మూడు వేల మంది పోలీసుల బందోబస్తు ఉండవచ్చు. పట్టణంలోకి వచ్చే 17 ప్రధాన మార్గాల్లో తనిఖీలు కొనసాగవచ్చు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు నిఘా ఉండవచ్చు. కానీ ఈ ఏర్పాట్లన్నింటికంటే ముఖ్యమైనది ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం. ప్రతి ఓటరు తనకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయగలగడం, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగకుండా చూడటం, రాజకీయ జోక్యం, బెదిరింపులు, ఘర్షణలకు అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడం అసలైన ప్రమాణాలు. పోలీసు శాఖ తన చర్యల ద్వారా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామన్న నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలి. ఎన్నికల సంఘం కూడా ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం పరిశీలించాలి. రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలను ప్రజాస్వామ్య మార్గాల్లో వ్యక్తం చేయాలి. ఓటు వేయడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రికి భద్రత కల్పించడం పోలీసుల బాధ్యతే. అదే సమయంలో మిగిలిన ఓటర్ల భద్రత, స్వేచ్ఛను కాపాడటం కూడా అంతే ముఖ్యం. జగన్ రాకతో పులివెందులలో రాజకీయ చర్చకు తెరలేచింది. డీఐజీ ప్రకటనతో ఆ చర్చ మరింత విస్తరించింది. ఇప్పుడు మాటల యుద్ధం కంటే వ్యవస్థల పనితీరుపైనే ప్రజల దృష్టి నిలిచింది. నాయకులు ఎవరు వచ్చినా, రాజకీయ పార్టీలు ఎన్ని ఆరోపణలు చేసుకున్నా చివరకు ప్రజాస్వామ్యానికి గౌరవం దక్కాల్సింది స్వేచ్ఛాయుత పోలింగ్ ద్వారానే. పులివెందులలో ప్రశాంతంగా పోలింగ్ జరగడం, ప్రతి ఓటు స్వేచ్ఛగా నమోదవడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ముగియడం పోలీసు శాఖకు, ఎన్నికల సంఘానికి కీలక బాధ్యతగా మారింది. జగన్ రాకతో మొదలైన ఉత్కంఠకు అసలైన సమాధానం పోలింగ్ రోజు వ్యవస్థలు ఎలా పనిచేస్తాయన్నదానిపైనే ఆధారపడి ఉంది.

• చొక్కా మడత వ్యాఖ్యలకు పోలీసుల సమాధానం

జగన్ గతంలో పులివెందుల పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత పరిణామాలకు నేపథ్యంగా నిలిచాయి. పోలింగ్ రోజున తాను పులివెందులలోనే ఉంటానని, తనను ఎవరు అడ్డుకుంటారో చూస్తానని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా చొక్కా మడతపెట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీశాయి. తన సొంత నియోజకవర్గానికి రావడానికి ఎవరి అనుమతి అవసరమన్న భావనను ఆయన మాటల్లో వ్యక్తం చేశారు. ఇప్పుడు అదే అంశంపై పోలీసు శాఖ స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. ఓటు వేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును వినియోగించుకోవడానికి జగన్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. అయితే ఓటు వేయడం ఒకవైపే, ఎన్నికల సమయంలో పట్టణంలో తిరగడం, జనసమూహాల మధ్యకు వెళ్లడం, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం మరో అంశమని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన ఆంక్షలు ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి అయినంత మాత్రాన ప్రత్యేక మినహాయింపు ఉండదన్న సందేశం ఈ ప్రకటనలో కనిపిస్తోంది.

అదే సమయంలో జగన్ భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని డీఐజీ హామీ ఇచ్చారు. ఆయన చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరిస్తారని తాము భావించడం లేదని కూడా పేర్కొన్నారు. ఈ ప్రకటనను రాజకీయ హెచ్చరికగా కొందరు వ్యాఖ్యానిస్తుండగా, ఎన్నికల భద్రతలో భాగంగా తీసుకున్న ముందస్తు చర్యగా మరికొందరు చూస్తున్నారు. జగన్ పర్యటన సందర్భంగా అనుచరులు పెద్ద సంఖ్యలో చేరితే పరిస్థితులు ఎలా ఉంటాయన్నది మరో ప్రశ్నగా మారింది. అందుకే ముందుగానే పరిమితులను ప్రకటించి అవాంఛనీయ పరిణామాలు జరగకుండా చూడాలని పోలీసు శాఖ భావిస్తోంది. జగన్‌కు ఓటు హక్కు ఉంది. అయితే ఎన్నికల సమయంలో చట్టం నిర్దేశించిన పరిమితులను పాటించాల్సిందేనన్నది పోలీసుల స్పష్టమైన వైఖరి. నవంబర్ 1న జరిగే పరిణామాలు ఈ ప్రకటన అమలుకు కీలకంగా మారనున్నాయి.

• మూడు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు

పులివెందుల ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. పులివెందుల, జమ్మలమడుగు, కడప నగరాల్లో అదనపు బలగాలను అందుబాటులో ఉంచారు. కడప నగరంలోని 361 పోలింగ్ కేంద్రాల్లో 16 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, మరో 42 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పులివెందుల పట్టణంలోకి ప్రవేశించే 17 ప్రధాన మార్గాల వద్ద ప్రత్యేక తనిఖీలకు ఏర్పాట్లు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి అనధికారికంగా వ్యక్తులు ప్రవేశించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. లైసెన్సు కలిగిన ఆయుధాలను ముందుగానే పోలీసులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. రౌడీషీటర్లకు నోటీసులు ఇచ్చి, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనధికారికంగా హంగామా సృష్టించే వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూట్యూబ్ ఛానళ్ల పేరుతో కొందరు పోలింగ్ కేంద్రాల వద్ద గందరగోళం సృష్టించే ప్రయత్నం చేసినా ఉపేక్షించబోమని డీఐజీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్ లేదా ప్రభుత్వ అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతి ఉంటుందని తెలిపారు. ఈ ఏర్పాట్లతో మీడియా ప్రతినిధుల రాకపోకలపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు అమలులోకి వచ్చాయి. అయితే భద్రతా చర్యల పేరుతో సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం కూడా ముఖ్యం. చెక్‌పోస్టులు, తనిఖీలు, అదనపు బలగాల మోహరింపు మధ్య సామాన్య ఓటరు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా ఓటు వేసి తిరిగి వెళ్లే పరిస్థితులు కల్పించాలి. మూడు వేల మంది పోలీసుల మోహరింపు, 17 మార్గాల్లో తనిఖీలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. పులివెందుల ఎన్నికల భద్రతలో కీలక చర్యలుగా నిలిచాయి.

• పోలీసులపై అవినాష్‌రెడ్డి ఆరోపణలు

మరోవైపు పులివెందుల ఎన్నికల నేపథ్యంలో పోలీసు వ్యవస్థపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలు రాజకీయ వివాదాన్ని మరింత పెంచుతున్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అక్టోబర్ 30న నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు శాఖ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. పులివెందుల ఎన్నికలను అధికార యంత్రాంగం ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వస్తున్నాయని, డీఐజీ కోయ ప్రవీణ్ పర్యవేక్షణలోనే ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలు సాగుతున్నాయని విమర్శించారు. టీడీపీ నేతలు బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డి నామినేషన్ల ప్రక్రియను అడ్డుకున్నారని, మహిళా అభ్యర్థులకు కూడా నామినేషన్లు వేసే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. పోలీసుల కాల్పులు, స్మోక్ బాంబులు, టియర్ గ్యాస్ ప్రయోగం, పెద్ద సంఖ్యలో కేసుల నమోదు వంటి అంశాలను ప్రస్తావించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మందిని తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆరోపించారు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీ ఎంపీ చేసిన ఆరోపణలుగా ఉన్నాయి. వీటిపై అంతకుముందు అక్టోబర్ 28న పత్తికొండలో డీఐజీ కోయ ప్రవీణ్ స్పందించారు. రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకు పరిమితులు ఉండకపోవచ్చని, తనపై ఆరోపణలు చేసేవారు ఆధారాలు ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు. ఆరోపణలు వచ్చినంత మాత్రాన తన విధి నిర్వహణలో మార్పు ఉండదని స్పష్టం చేశారు. దీంతో పోలీసులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు, పోలీసు ఉన్నతాధికారులు ఇస్తున్న సమాధానాలు రాజకీయ చర్చలో ప్రధానాంశాలుగా మారాయి. ఒకవైపు ఎన్నికల ప్రక్రియలో పోలీసుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, మరోవైపు ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గకుండా విధులు నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల సంఘం పాత్ర కూడా కీలకంగా మారుతుంది. రాజకీయ పార్టీలు చేసిన ఆరోపణలను సంబంధిత ఆధారాలతో పరిశీలించి, ఫిర్యాదులపై నిబంధనల ప్రకారం స్పందించాల్సిన అవసరం ఉంది. పోలీసులు తీసుకున్న చర్యలకు సంబంధించి స్పష్టమైన వివరణ ఇవ్వడం కూడా ప్రజల్లో విశ్వాసం పెంచుతుంది. పోలీసులపై పక్షపాత ఆరోపణలు, అధికారుల సమాధానాల మధ్య ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగడమే ఇప్పుడు ప్రధాన సవాలు.

• జగన్ పర్యటనతో పోలీసులకు అదనపు బాధ్యతలు

పులివెందులలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే ఎన్నికల పోటీ కేవలం రాజకీయ పార్టీల మధ్య ప్రచారానికే పరిమితం కాలేదు. రాజకీయ నాయకుల ప్రభావం, పోలీసు యంత్రాంగం వ్యవహారశైలి, ఎన్నికల నిబంధనల అమలు, ఓటర్ల స్వేచ్ఛ వంటి అంశాలు ఒకేసారి తెరపైకి వచ్చాయి. ఈ పరిణామాలన్నింటికీ జగన్ రాక కేంద్రబిందువుగా మారింది. ఆయన పులివెందులకు వస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, జనసమూహాల నిర్వహణ పోలీసులకు అదనపు బాధ్యతగా మారుతుంది. ఒకవేళ అనుమతి లేని ప్రాంతాల్లో జనసమీకరణ జరిగినా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించినా పరిస్థితులు మరో మలుపు తిరిగే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగానే డీఐజీ పరిమితులను ప్రకటించినట్లు కనిపిస్తోంది. అయితే రాజకీయ నాయకుల హక్కులతో పాటు సాధారణ ప్రజల హక్కులను కూడా సమానంగా చూడాల్సిన అవసరం ఉంది. జగన్‌కు ఓటు వేసే హక్కు ఉన్నట్లే పులివెందులలోని ప్రతి పౌరుడికీ తన ఓటు హక్కును వినియోగించుకునే స్వేచ్ఛ ఉంది. మాజీ ముఖ్యమంత్రి అయినా, అధికార పార్టీ నాయకుడైనా, ప్రతిపక్ష నేత అయినా, సామాన్య పౌరుడైనా చట్టం ముందు అందరూ సమానమే. పోలీసు చర్యలు కూడా అందరికీ ఒకే విధమైన ప్రమాణాలతో ఉండాలి. అధికార పక్షానికి ఒక నిబంధన, ప్రతిపక్షానికి మరో నిబంధన అన్న భావన ప్రజల్లో ఏర్పడకూడదు. ఎవరిపై చర్యలు తీసుకున్నా అందుకు తగిన కారణాలు ఉండాలి. ఎవరికి అనుమతి ఇచ్చినా, ఎవరిని నిలువరించినా నిబంధనల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. పోలీసులు తమ నిర్ణయాలు, భద్రతా ఏర్పాట్లపై అవసరమైన సమాచారాన్ని పారదర్శకంగా వెల్లడించాలి. రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ వాటి ప్రభావం ఓటర్లపై పడకూడదు. ఎన్నికల రోజున ప్రజలు భయపడకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్లగలగాలి. నాయకుల పర్యటనలు, కార్యకర్తల సందడి, రాజకీయ ప్రకటనల కంటే ఓటర్ల స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. పోలీసుల చర్యల్లో పారదర్శకత ఉండాలి. ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకూడదు. పులివెందుల ఎన్నికల నిర్వహణలో ఈ మూడు అంశాలే అత్యంత కీలకంగా మారనున్నాయి.





పోర సరఫరా.. అవినీతిని ఆపరా?

ఒకవైపు మార్కెట్లో బియ్యం ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. మరోవైపు పేదల ఆకలి తీర్చాల్సిన ఉచిత రేషన్ బియ్యం చుట్టూ అనేక అనుమానాలు ముసురుకుంటున్నాయి! ప్రభుత్వ ఖజానా నుంచి వేల కోట్ల రూపాయల సబ్సిడీ వెచ్చిస్తున్నా.. ఆ బియ్యం నిజమైన లబ్ధిదారుడి ఇంటికే చేరుతోందా? అర్హుల పేరుతో అనర్హులు ప్రయోజనాలు పొందుతున్నారా? మరణించిన వారి పేర్లు, వలస వెళ్లిన కుటుంబాల వివరాలు, నకిలీ కార్డులు, ఒకే వ్యక్తి పేరు అనేకసార్లు ఎంట్రీ కావడం, ఇవన్నీ ప్రజాధనానికి గండికొడుతున్నాయి? గోదాముల్లో నిల్వల లెక్కలు ఒకలా.. మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం మరోలా.. దుకాణాల్లో పంపిణీ లెక్కలు ఇంకోలా ఉంటే అసలు నిజం ఎక్కడ దాగుంది? తెలంగాణలో ఏటా 28.56 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా, అందుబాటులో ఉన్నట్లు చెబుతున్న నిల్వలు, రావాల్సిన సరఫరాలపై ఇప్పుడు లెక్కల పరిశీలన అవసరమైంది. రేషన్ కార్డులపై ప్రత్యేక సమగ్ర విచారణ జరపాలని సామాజిక కార్యకర్త దరఖాస్తుదారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. అనర్హుల ఏరివేత పేరుతో నిజమైన పేదల పొట్టకొట్టకూడదు.. అక్రమాల పేరుతో ప్రజాధనం దోచుకున్నవారిని వదిలిపెట్టకూడదు. కార్డుల వెనుక కథ ఏమిటి? బియ్యం మాయమవుతున్న దారులేవి? ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టం ఎంత? తెరవెనుక బాధ్యులెవరు? రేషన్ బియ్యం చుట్టూ అల్లుకున్న ఈ మాయాజాలం ఏంటి?



- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- పేదల కడుపు కొడుతున్న బ్లాక్ మార్కెట్ దెయ్యం
- మంత్రి ఉత్తుత్తి వార్నింగ్
- అక్రమార్కులతో అధికారులు ఫిక్సింగ్

ఆరు నెలలకోసారి బియ్యం తీసుకోకపోతే కార్డు రద్దు చేస్తారా? అర్హత లేని వారి పేర్లతో పేదల బియ్యం పక్కదారి పడుతోందా? రేషన్ దుకాణాల నుంచి గోదాముల వరకు ఎక్కడెక్కడ లోపాలున్నాయి? ఉచిత బియ్యం పంపిణీ వెనుక ప్రభుత్వ ఖజానాకు ఎంత భారం పడుతోంది? అసలు లబ్ధిదారులెవరు? కాగితాలపై ఉన్న లబ్ధిదారులెవరు? పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటైన ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారుతున్నాయి. తెలంగాణలో రేషన్ కార్డుల అర్హతలపై సమగ్ర పరిశీలన, బియ్యం నిల్వల లెక్కలు, పంపిణీ విధానం, ప్రజాధన వినియోగంపై స్వతంత్ర విచారణ జరగాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. ఆగస్టు 22న సామాజిక కార్యకర్త దరఖాస్తుదారు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా, అక్టోబర్ 22న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌరసరఫరాల కమిషనర్, పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులకు మరోసారి సమగ్ర ఫిర్యాదు అందించారు. మరోవైపు పౌరసరఫరాల శాఖ ఇచ్చిన అధికారిక సమాధానంలో అనర్హులుగా అనుమానం వచ్చిన వారి కార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. అంటే సమస్యపై ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన చేస్తున్నట్లు స్పష్టమవుతున్నా... అసలు అక్రమాల పరిమాణం ఎంత? ఎక్కడ జరిగాయి? ఎంత ప్రజాధనం నష్టపోయింది? ఎవరి బాధ్యత ఎంత? అన్న ప్రశ్నలకు మాత్రం సమగ్ర లెక్కలు, బహిరంగ నివేదిక అవసరం. పేదలకు అందాల్సిన గింజ పేదలకే చేరిందా? లేక వ్యవస్థలోని లోపాలు కొందరికి అక్రమ లాభాల మార్గాలుగా మారాయా? ఇదే ఇప్పుడు తేలాల్సిన అసలు విషయం.

• ధరల మంట.. ఉచిత బియ్యం వెనుక ఆర్థిక భారం

బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు భారీగా పెరుగుతుంటే, ప్రభుత్వం కోట్లాది మందికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. తెలంగాణలో సన్నబియ్యం ధర కిలో రూ.85-95కు చేరగా, 25 కిలోల బస్తా ధర రూ.2,200 నుంచి రూ.2,500కు పెరిగింది. కందిపప్పు కిలో రూ.175 నుంచి రూ.2000 పలుకుతోంది. మినపప్పు, పెసరపప్పు, చక్కెర ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాలపై ఆహార ఖర్చుల భారం అధికమవుతోంది. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం పేదలకు కీలకంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం 2025 ఏప్రిల్ నుంచి అర్హులైన కుటుంబాలకు ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి నెలకు 30 కిలోలు, పది మంది ఉంటే 60 కిలోలు లభిస్తున్నాయి. అయితే బియ్యం సేకరణ, మిల్లింగ్, రవాణా, గోదాముల నిర్వహణ, పంపిణీకి ప్రభుత్వం భారీగా ప్రజాధనం వెచ్చిస్తోంది. లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున చిన్నపాటి లెక్కల తేడా కూడా ప్రభుత్వ ఖజానాపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం నిజమైన లబ్ధిదారులకు చేరుతోందా? మధ్యలో అక్రమంగా పక్కదారి పడుతోందా? అన్నది తేలాలి. రైతుల నుంచి ధాన్యం సేకరణ మొదలుకొని లబ్ధిదారుడికి బియ్యం చేరే వరకు మొత్తం సరఫరా వ్యవస్థను పరిశీలించినప్పుడే అసలు లెక్కలు, లోపాలు బయటపడతాయి.

• కార్డుల లెక్కల్లోనే అసలు గందరగోళం

తెలంగాణలో రేషన్ కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, వాస్తవ జనాభా మధ్య గణాంకాల సమన్వయం అవసరం. దరఖాస్తుదారు ఆగస్టు 22న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన ఫిర్యాదులో 2025 జూలై 14నాటి ప్రభుత్వ ప్రకటనను ప్రస్తావిస్తూ సుమారు 3.10 కోట్ల కార్డుదారులకు ఆహార భద్రత ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగా 5.61 లక్షల రేషన్ కార్డులు జారీ చేయగా, మరో 28.32 లక్షల మంది కుటుంబ సభ్యులను చేర్చినట్లు తెలిపారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం తెలంగాణ జనాభా సుమారు 3.69 కోట్లు. అయితే ఇవి వేర్వేరు కాలాలకు చెందిన గణాంకాలు కావడంతో నేరుగా పోల్చి అక్రమాలున్నాయని నిర్ధారించలేం. జనాభా పెరుగుదల, వలసలు, కుటుంబ విభజనలు, మరణాలను పరిగణనలోకి తీసుకుని ఒకే వ్యక్తి ఇతర కార్డుల్లో ఉన్నారా? మరణించిన వారి పేర్లు కొనసాగుతున్నాయా? అనేది పరిశీలించాలి. లోక్‌సభ ప్రశ్న నంబర్ 3623, తేదీ 11 ఆగస్టు 2025 ప్రకారం తెలంగాణలో 2024-25 మదింపు సంవత్సరానికి 14,08,774 ఆదాయపు పన్ను రిటర్నులు నమోదయ్యాయి. వీరిలో రూ.25 లక్షలకు మించిన ఆదాయం ప్రకటించినవారు కూడా ఉన్నారు. అయితే ఆదాయపు పన్ను రిటర్ను దాఖలు చేయడం ఒక్కటే అనర్హతకు ఆధారం కాదు. తెలంగాణ ఆహార భద్రత నిబంధనలు 2017 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయ పరిమితి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు కాగా, తడి భూమి 3.5 ఎకరాలు, పొడి భూమి 7.5 ఎకరాల పరిమితులున్నాయి. భూమి ఉందనే కారణంతోనే అనర్హులుగా ప్రకటించకుండా దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పరిగణించాలి. కాబట్టి పాత గణాంకాల ఆధారంగా కార్డులు తొలగించకుండా ప్రస్తుత అర్హత నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబాన్ని సమగ్రంగా పరిశీలించాలి.

• గోదాము నుంచి దుకాణం వరకు.. బియ్యం మాయమయ్యే దారులు

రేషన్ బియ్యం అక్రమాలపై విచారణలో కార్డుల అర్హతతోపాటు సరఫరా వ్యవస్థలోని ప్రతి దశను పరిశీలించాలి. ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు చేరిన ధాన్యాన్ని మర ఆడించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించడాన్ని కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) అంటారు. మిల్లుల నుంచి గోదాములకు, అక్కడి నుంచి చౌక ధరల దుకాణాలకు చేరే బియ్యం పరిమాణం, లబ్ధిదారులకు పంపిణీ చేసిన నిల్వలతో సరిపోవాలి. ఈ క్రమంలో తప్పుడు నమోదు, తక్కువ సరఫరా, నిల్వల తారుమారు, అక్రమ తరలింపు జరిగితే ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుంది. మిల్లులకు ఇచ్చిన ధాన్యం, తిరిగి వచ్చిన బియ్యం మధ్య వ్యత్యాసాలకు కారణాలేమిటి? గోదాముల్లో నమోదైన నిల్వలు, వాస్తవ నిల్వలు ఎందుకు సరిపోవడం లేదు? రవాణాలో బియ్యం మాయమైతే బాధ్యత ఎవరిది? అన్నది తేల్చాలి. 2025 నవంబర్ 4న తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పీడీఎస్ బియ్యం అక్రమ మళ్లింపుపై విచారణ జరిపి సుమారు రూ.50 కోట్ల విలువైన బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించింది. జనగామ జిల్లాలోని ఒక మిల్లుకు సంబంధించిన 2022-23 రబీ సీజన్ సీఎంఆర్ ధాన్యం మళ్లింపు ఆరోపణల్లో 1,39,671.86 క్వింటాళ్ల పరిమాణం, సుమారు రూ.28.88 కోట్ల విలువ ప్రస్తావించబడింది. సైబరాబాద్ పరిధిలోని ఒక నిల్వ కేంద్రంలో 75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇవి వార్తల్లో వెల్లడైన విచారణ వివరాలు, ఆరోపణలు మాత్రమే; తుది న్యాయ నిర్ధారణగా భావించరాదు. అయినప్పటికీ పీడీఎస్ బియ్యం అక్రమ మళ్లింపుపై సమగ్ర నిఘా, స్వతంత్ర విచారణ అవసరాన్ని ఈ ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

• ఆరు నెలలుగా బియ్యం తీసుకోకపోతే కార్డు కట్‌నా?

రేషన్ కార్డుల తొలగింపుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు స్పష్టత అవసరం. ఆరు నెలల పాటు బియ్యం తీసుకోకపోతే కార్డు ఆటోమేటిక్‌గా రద్దవుతుందనే ప్రచారం ఉన్నప్పటికీ, ప్రతి కార్డును తప్పనిసరిగా తొలగించాలనే సాధారణ నిబంధనకు పరిశీలించిన పత్రాల్లో ఆధారం కనిపించడం లేదు. ఉపాధి కోసం వలసలు, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు, వృద్ధాప్యం, అనారోగ్యం వంటి కారణాలతో కొందరు రేషన్ తీసుకోలేకపోవచ్చు. అందువల్ల బియ్యం తీసుకోలేదనే ఒక్క కారణంతో పేదల ఆహార భద్రత హక్కును తొలగించకూడదు. అదే సమయంలో ఉనికిలో లేని కుటుంబాల పేర్లతో బియ్యం కేటాయింపులు జరుగుతున్నాయా అన్నదీ పరిశీలించాలి. దరఖాస్తుదారు ఫిర్యాదుపై స్పందించిన పౌరసరఫరాల శాఖ, రాష్ట్రవ్యాప్తంగా అనుమానాస్పద ఆహార భద్రత కార్డులను తనిఖీ చేస్తున్నామని, అనర్హులుగా గుర్తించిన వారిని నిబంధనల ప్రకారం డేటాబేస్ నుంచి తొలగిస్తున్నామని అధికారికంగా తెలిపింది. అయితే ఇప్పటిపరకు ఎన్ని కార్డులు పరిశీలించారు? ఎన్ని తొలగించారు? అభ్యంతరాలపై ఎంతమందికి తిరిగి అర్హత కల్పించారు? అనే వివరాలు వెల్లడించాలి. తెలంగాణ ప్రభుత్వ స్మార్ట్ పీడీఎస్ వ్యవస్థలో ఆగస్టు 2026 గణాంకాల ప్రకారం మొత్తం 1,06,28,092 కార్డులు నమోదై ఉండగా, 98,23,322 కార్డులు బియ్యం పొందినట్లు చూపించారు. మరో 42,69,217 కార్డులకు ఇతర ప్రాంతాల్లో రేషన్ పొందే సౌకర్యం వినియోగమైనట్లు నమోదైంది. ఈ గణాంకాలు పంపిణీకి సంబంధించిన డిజిటల్ ఆధారాలను చూపుతున్నప్పటికీ, బియ్యం తీసుకోని కార్డులన్నీ అనర్హమైనవని నిరూపించవు. కాబట్టి కుటుంబ పరిస్థితులు, వలసలు, అర్హతలను పరిశీలించిన తర్వాతే కార్డులపై నిర్ణయం తీసుకోవాలి.

• నిల్వల లెక్కల్లో తేడా వస్తే బాధ్యులెవరు?

ప్రభుత్వం ప్రకటించిన బియ్యం నిల్వలు, మిల్లర్ల నుంచి రావాల్సిన సరఫరాలు, వాస్తవ పంపిణీ మధ్య సమన్వయం లేకపోతే ఆర్థిక లెక్కలు ప్రశ్నార్థకమవుతాయి. తెలంగాణకు సంవత్సరానికి 28.56 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా, పౌరసరఫరాల శాఖ అక్టోబర్ 16 నాటికి ప్రభుత్వ గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నట్లు అంచనా వేసింది. ఇందులో కేంద్ర నిల్వలు, ఇతర సంక్షేమ పథకాల వాటా 3.50 లక్షల టన్నులు, రాష్ట్ర నిల్వలు 6.14 లక్షల టన్నులు. మరో 18.39 లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సిన కస్టమ్ మిల్డ్ రైస్ సరఫరాలు, ఇతర వనరుల ద్వారా అందుతుందని అంచనా. ఈ రెండింటినీ కలిపి 28.03 లక్షల టన్నుల బియ్యం అందుబాటులో ఉంటుందని, ఇది సుమారు 11.7 నెలల అవసరాలకు సరిపోతుందని అధికారులు ప్రకటించారు. అయితే 9.64 లక్షల టన్నులు ఇప్పటికే ఉన్న నిల్వలు కాగా, 18.39 లక్షల టన్నులు ఇంకా రావాల్సిన సరఫరాలు. మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న బియ్యం, బకాయిలు, సరఫరా ఆలస్యం, నాణ్యత పరీక్షల్లో తిరస్కరణకు గురైన పరిమాణంపై వివరాలు వెల్లడించాలి. వార్షిక అవసరాలు, గోదాముల నిల్వలు, మిల్లర్ల సరఫరాలు, దుకాణాలకు చేరిన బియ్యం, ఈపోస్ పంపిణీ వివరాలను ఒకే డిజిటల్ వ్యవస్థలో అనుసంధానించి జిల్లా వారీగా నెలవారీ లెక్కలు ప్రకటించాలి. కొనుగోలు నుంచి పంపిణీ వరకు ప్రతి బస్తాకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, రవాణా, గోదాములు, మిల్లులు, దుకాణాల నిల్వలను స్వతంత్రంగా తనిఖీ చేయాలి. ఎక్కడైనా నిల్వల్లో తేడా కనిపిస్తే మిల్లర్లతోపాటు తనిఖీలు చేయని అధికారులు, సరుకు విడుదల చేసినవారు, రవాణాను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం వహించిన వారి బాధ్యతను కూడా ఆధారాలతో నిర్ధారించాలి.



• చట్టం ఏం చెబుతోంది? విచారణ ఎక్కడి నుంచి మొదలవ్వాలి?

రేషన్ వ్యవస్థలో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. అవసరమైన వస్తువుల చట్టం-1955లోని సెక్షన్ 9 ప్రకారం, సెక్షన్ 3 కింద జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి తెలిసి తప్పుడు సమాచారం ఇచ్చినా, రికార్డులు, ఖాతాలు, నివేదికల్లో తప్పుడు వివరాలు నమోదు చేసినా గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఈ నిబంధన వర్తింపు మాత్రం నేర స్వభావం, ఆధారాలపై ఆధారపడి ఉంటుంది. దరఖాస్తుదారు తన ఫిర్యాదులో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డులపై ప్రత్యేక సమగ్ర విచారణ చేపట్టి, ఆధార్ ఆధారిత నకిలీ నమోదులు, మరణించిన లబ్ధిదారులు, వలస కుటుంబాలు, బహుళ కార్డులు, అనర్హుల వివరాలను గుర్తించాలని కోరారు. ఆదాయం, ప్రభుత్వ ఉద్యోగం, పెన్షన్, భూముల రికార్డులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత లేని కార్డులు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలతోపాటు చట్టబద్ధంగా నష్టాల వసూలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బాధ్యతలను గుర్తించి, అక్రమాల్లో అధికారుల పాత్రను కూడా ఆధారాలతో పరిశీలించాలని కోరారు. అయితే నిజమైన పేదల కార్డులు తొలగించకుండా ముందస్తు నోటీసు, తమ వాదన వినిపించే అవకాశం కల్పించాలి. ఆగస్టు 22న కేంద్రానికి, అక్టోబర్ 22న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ఫిర్యాదుల్లో 30 రోజుల్లో చర్యల నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వారీగా తనిఖీలు, తొలగించిన కార్డులు, ఆదా అయిన సబ్సిడీ, జరిగిన నష్టం, బాధ్యుల వివరాలను బహిరంగపరచాలి. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి.. ప్రజాధనాన్ని కాపాడాలి.. నిజమైన పేదలకు ఒక్క గింజ కూడా దూరం కాకుండా చూడాలి.

- గంజి శ్రీనివాసరావు, బ్యూరో చీఫ్

టెస్టు క్రికెట్‌లో ప్రొటీస్‌దే ప్రపంచ ఆధిపత్యం!



ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం.. నంబర్ వన్ సింహాసనం సొంతం! టెస్టు క్రికెట్‌లో దక్షిణాఫ్రికా జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. మైదానంలో అద్భుత పోరాటం, ప్రత్యర్థిపై తిరుగులేని ఆధిపత్యంతో ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను 21తో గెలుచుకున్న ప్రొటీస్.. ఏకంగా నంబర్ వన్ ర్యాంకును అందుకుని ప్రపంచ క్రికెట్‌కు తన సత్తా చాటింది. తొలి టెస్టులో ఎదురైన ఫలితాన్ని పట్టించుకోకుండా, ఆ తర్వాత వరుసగా పుంజుకుని ఆసీస్‌ను చిత్తు చేసిన తీరు అభిమానులను ఉర్రూతలూగించింది. ఈ విజయం కేవలం సిరీస్ గెలుపు మాత్రమే కాదు.. దక్షిణాఫ్రికా క్రికెట్ పునరాగమనానికి బలమైన సంకేతం. ఆటగాళ్ల సమష్టి కృషి, పోరాట పటిమ, ఒత్తిడిలోనూ నిలబడిన తెగువ జట్టును ప్రపంచ శిఖరానికి చేర్చాయి. ఈ ఘనతపై ప్రొటీస్ క్రికెట్ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ఆనందం వ్యక్తం చేస్తూ.. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలిచామని ప్రకటించింది. ట్రోఫీతో పాటు టెస్టు క్రికెట్‌లో అగ్రపీఠం దక్కించుకున్న దక్షిణాఫ్రికా.. ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటేందుకు సిద్ధమైంది. ప్రపంచమే వేదిక.. ప్రొటీస్‌దే అగ్రస్థానం!

కంగారూలకు కళ్లెం

ప్రొటీస్‌లకు సిరీస్ కిరీటం!



కేప్‌టౌన్‌లో కంగారూల ఆధిపత్యానికి ప్రొటీస్‌లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి టెస్టులో ఓటమితో వెనుకబడిన దక్షిణాఫ్రికా.. ఆ తర్వాత వరుసగా పుంజుకుని మూడు టెస్టుల సిరీస్‌ను 21తో కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో టెస్టు చివరి రోజు ఆస్ట్రేలియాకు 288 పరుగుల లక్ష్యం ఎదురుకాగా, ప్రొటీస్ బౌలర్లు నిప్పులు చెరిగారు. కగిసో రబాడ కొత్త బంతితో టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చగా, సైమన్ హార్మర్ స్పిన్ మాయాజాలంతో కంగారూలను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఆరు వికెట్లతో చెలరేగిన హార్మర్ దెబ్బకు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కుప్పకూలింది. నాథన్ లయన్ 33 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం కంగారూల బ్యాటింగ్ పతనానికి అద్దం పట్టింది. రబాడ మూడు వికెట్లు పడగొట్టగా, హార్మర్ మ్యాచ్‌లో మొత్తం పది వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మరోవైపు 198 పరుగులు, 13 వికెట్లతో ఆల్‌రౌండ్ మెరుపులు మెరిపించిన మార్కో జాన్సెన్ సిరీస్ ఉత్తమ ఆటగాడిగా నిలిచాడు. 176 పరుగుల ఘన విజయంతో దక్షిణాఫ్రికా సిరీస్‌ను సొంతం చేసుకోవడమే కాకుండా టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరింది. ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ పట్టికలో టాప్2 నుంచి మూడో స్థానానికి పడిపోయింది. ఓటమితో మొదలైన ప్రొటీస్ ప్రయాణం.. విజయ కిరీటంతో ముగిసింది!



వైభవ్‌ను ఇంటికి పంపించేయండి

అవకాశాలు ఇవ్వకపోతే అదే బెటర్..!

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జట్టులో స్థానం దక్కకపోవడంపై మాజీ ఓపెనర్ ఆకాష్ చోప్రా అసంతృప్తి వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20లో ఇషాన్ కిషన్ ఫిట్‌నెస్ సాధించడంతో వైభవ్‌ను పక్కన పెట్టడంపై కీలక ప్రశ్నలు సంధించాడు. రెండో టీ20లో 4 పరుగులు, మూడో టీ20లో 45 పరుగులు చేసిన ఈయువ ఆటగాడు తన ప్రతిభను చాటుకున్నాడని గుర్తుచేశాడు. ముఖ్యంగా గత మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీ సాధించగా, వైభవ్ అర్ధసెంచరీకి చేరువయ్యాడని పేర్కొన్నాడు. అయినప్పటికీ అతడిని పక్కన పెట్టడం నిరాశ కలిగించిందన్నాడు. ఎవరైనా గాయపడితేనే వైభవ్‌కు అవకాశం ఇస్తారా? అదే విధానం కొనసాగితే అతడిని ఇంటికి పంపించి ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడించండి! అంటూ ఘాటుగా స్పందించాడు. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం అనుభవాన్ని ఇస్తుందని, కానీ నిరంతరం బెంచ్‌కే పరిమితమైతే బ్యాటింగ్‌కు దూరమవుతాడని హెచ్చరించాడు. వైభవ్ భవిష్యత్తుపై జట్టు యాజమాన్యం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని కోరాడు. మరోవైపు నాలుగో టీ20లో తిరిగి వచ్చిన ఇషాన్ కిషన్ డకౌట్ కావడం గమనార్హం. 260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ 172/9కే పరిమితమైంది.

యువ సంచలనాలకు యువీ బాసట!



టీమిండియాలో ప్రతిభకు కొదవలేదు.. కానీ ఆ ప్రతిభకు తగ్గ అవకాశాలు దక్కుతున్నాయా? బీసీసీఐ సెలెక్టర్లకు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ గట్టిగానే చురకలంటించాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ లాంటి ప్రతిభావంతులను వన్డే జట్టులో తరచూ ఎంపిక చేయకపోవడం వారి సామర్థ్యానికి అన్యాయం చేయడమేనని స్పష్టం చేశాడు. ముఖ్యంగా తన శిష్యుడు అభిషేక్‌ను వన్డేల్లో చూడాలని ఉందంటూ మనసులో మాట బయటపెట్టాడు. సీనియర్ ఆటగాళ్లతో జట్టులో పోటీ ఎక్కువగా ఉంటుందని అంగీకరిస్తూనే, యువ ఆటగాళ్ల ప్రదర్శనను గుర్తించి త్వరలోనే అవకాశాలు కల్పించాలని సూచించాడు. ఇదిలా ఉంటే న్యూజిలాండ్‌తో మూడో టీ20లో అభిషేక్ విధ్వంసం మరోసారి క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. కేవలం 15 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసి, 35 బంతుల్లో శతకం బాదాడు. తన గురువు యువీ 2007లో ఇంగ్లండ్‌పై 12 బంతుల్లో అర్ధశతకం సాధించిన రికార్డుకు చేరువగా వచ్చాడు. దీనిపై యువీ సరదాగా చేసిన సవాల్‌కు అభిషేక్ కూడా చమత్కారంగా స్పందించాడు. 12 బంతుల్లో అర్ధసెంచరీ చేయడం అంత సులభం కాదన్నాడు. మైదానంలో యువీ వారసత్వాన్ని కొనసాగిస్తున్న అభిషేక్‌కు ఇప్పుడు వన్డేల్లోనూ అవకాశం ఇవ్వాలన్నది గురువు డిమాండ్! యువ ప్రతిభకు సెలెక్టర్లు ఎప్పుడు పట్టం కడతారో చూడాలి.

హాంకాంగ్ గెలుపుకే పండగలా.. షెహబాజ్ హుడావుడి!

భారత్‌పై గెలిస్తే చాలు.. అది ఏ టోర్నీ అయినా పాకిస్తాన్‌కు ప్రపంచకప్పే! హాంకాంగ్ సిక్సెస్‌లో టీమిండియాపై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించగానే పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. ఏకంగా సోషల్ మీడియాలో అభినందనల వర్షం కురిపించడమే కాదు.. ఆటగాళ్లను ఆకాశానికెత్తేశారు. ఇంకేముంది.. నెటిజన్లకు కావాల్సినంత సరుకు దొరికింది! 'హాంకాంగ్ సిక్సెస్‌గెలుపుకేప్రధాని పోస్టా? ఇక సెలవులు కూడా ప్రకటించండి!' అంటూ సెటైర్లతో ఉతికి ఆరేశారు. ఆరు ఓవర్ల పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 88/5 పరుగులు చేసింది. షాంక్ సింగ్ కేవలం 11 బంతుల్లో 40 పరుగులతో మెరుపులు మెరిపించాడు. కానీ పాకిస్తాన్ ఛేజింగ్‌లో మాత్రం బౌలర్లకు చుక్కలు చూపించింది. అబ్బాస్ అఫ్రిది 8 బంతుల్లో 35, ఖవాజా నఫే 12 బంతుల్లో అజేయంగా 41 పరుగులతో విధ్వంసం సృష్టించారు. కేవలం 3.5 ఓవర్లలోనే 89 పరుగుల లక్ష్యాన్ని ఛేదించారు. నాలుగు వికెట్లతో గెలిచిన పాకిస్తాన్‌కు ప్రధాని ప్రశంసలు దక్కాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం అసలు మ్యాచ్ మొదలైంది! ఆసియా కప్, ప్రపంచకప్ విజయాల స్థాయిలో ఈ చిన్న టోర్నీ గెలుపును సంబరంగా మార్చడమే నెటిజన్లకు అసలు వినోదంగా మారింది. మ్యాచ్ గెలిచింది పాకిస్తాన్.. కానీ సెటైర్ల మ్యాచ్‌లో మాత్రం నెటిజన్లదే పైచేయి!



మెగా ఫ్యామిలీ రీయూనియన్

'మెగావర్స్'లో పవర్‌స్టార్, గ్లోబల్‌స్టార్! ఒకే వేదికపై చిరంజీవి, పవన్, రామ్‌చరణ్

మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అరుదైన క్షణం త్వరలోనే బుల్లితెరపై సందడి చేయబోతోందా? పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ కలిసి ఒకే సినిమాలో కనిపించాలన్న కోరిక ఇప్పట్లో నెరవేరకపోయినా.. ఇద్దరూ ఒకే వేదికపైకి వచ్చే అవకాశం ఉందన్న వార్త మెగా ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపుతోంది. మెగాస్టార్ చిరంజీవి నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందిస్తున్న టాక్‌షో 'మెగావర్స్' ఈ అరుదైన కలయికకు వేదిక కానుందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇప్పటికే మూడు ఎపిసోడ్ల షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రమోషనల్ వీడియో సిద్ధం చేసే పనులు కూడా జరుగుతున్నాయి. తొలి సీజన్‌ను ప్రత్యేకంగా ముగించేందుకు చిరంజీవి.. పవన్ కళ్యాణ్, రామ్‌చరణ్‌లతో ప్రత్యేక ఎపిసోడ్లు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే నిజమైతే మెగా కుటుంబంలోని ముగ్గురు అగ్రతారలు ఒకే వేదికపై మనసు విప్పి మాట్లాడే అరుదైన దృశ్యం అభిమానులకు కనువిందు చేయనుంది. చివరిసారిగా చిరంజీవి, పవన్, రామ్‌చరణ్ ముగ్గురూ బహిరంగంగా ఒకే వేదికపై కనిపించింది 'చిరుత' సినిమా ప్రమోషన్ల సమయంలోనే. ఇప్పుడు 'మెగావర్స్'లో వారి కలయిక నిజమైతే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మెగా సందడి మరోసారి ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. వెండితెరపై కలిసి కనిపించే ఆ కల ఎప్పుడు నెరవేరుతుందో తెలియదు కానీ.. బుల్లితెరపై ఈ మెగా సంగమం కోసం అభిమానుల ఎదురుచూపులు మాత్రం అప్పుడే మొదలయ్యాయి!



రాముడిగా రణ్‌బీర్ దశరథుడిగా అరుణ్ గోవిల్!

• 39 ఏళ్ల చరిత్రకు తెర • కొత్త తరానికి రామాయణం • వెండితెరపై మహా సంగ్రామం!

రామాయణం అంటే తరతరాల జ్ఞాపకం.. రాముడు అంటే అరుణ్ గోవిల్ రూపమే గుర్తొచ్చే కోట్లాది అభిమానులు.. ఇప్పుడు అదే రామాయణంలో మరోసారి అద్భుతం ఆవిష్కృతం కాబోతోంది! దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, దశరథుడిగా ఒకప్పటి రాముడు అరుణ్ గోవిల్ కనిపించనుండటం సినీ ప్రపంచంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 1987లో రామానంద్ సాగర్ రూపొందించిన టెలివిజన్ రామాయణంలో అరుణ్ గోవిల్ అభినయం ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఆయన చిరునవ్వు, ప్రశాంతత, అమాయకత్వం, సంభాషణల తీరు రాముడి ప్రతిరూపంగా నిలిచాయి. 2020 కరోనా లాక్‌డౌన్‌లో పునఃప్రసారమైన ఆ ధారావాహిక ఒక్కరోజులోనే 77 మిలియన్ల మంది వీక్షకులను ఆకట్టుకుని రికార్డు సృష్టించింది. అప్పటి నుంచి రాముడి పాత్రలో నటించిన ప్రతి ఒక్కరినీ అరుణ్ గోవిల్‌తో పోల్చడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు ఆ సవాలును రణ్‌బీర్ స్వీకరిస్తున్నాడు. దాదాపు రూ.4,000 కోట్ల భారీ వ్యయంతో, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ సరికొత్త రూపంలో రాముడిని పరిచయం చేయనున్నాడు. అరుణ్ గోవిల్ సైతం రణ్‌బీర్ తన దృష్టిలో రాముడి పాత్రకు దగ్గరగా ఉన్నాడని ప్రశంసించడం విశేషం. యష్ రావణుడిగా, రణ్‌బీర్ రాముడిగా తెరపైకి రాబోతున్న ఈ మహా దృశ్యకావ్యంలో అసలు విజేత ఎవరు? నాలుగు దశాబ్దాల అభిమానాన్ని కొత్త రాముడు అధిగమిస్తాడా? లేక అరుణ్ గోవిల్ సృష్టించిన చరిత్రే మరోసారి అజేయంగా నిలుస్తుందా? అభిమానుల ఉత్కంఠకు సమాధానం వెండితెరపైనే!

రామాయణం ఇంగ్లిష్ వెర్షన్‌పై అభిమానుల్లో అసంతృప్తి

భారతీయుల గుండెల్లో తరతరాలుగా నిలిచిన రామాయణం.. ఇప్పుడు ప్రపంచ సినీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రూపొందిన ఈ ప్రతిష్టాత్మక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. అంతర్జాతీయ స్థాయిలో భారీ ఈవెంట్ చిత్రంగా నిలిపేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ఇంగ్లిష్ వెర్షన్‌ను కూడా సిద్ధం చేశారు. ఇటీవల లాస్‌ఏంజెల్స్‌లో అభిమానులు, విమర్శకుల కోసం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించగా.. అక్కడి స్పందనతో పాటు కొన్ని అంశాలపై అసంతృప్తి కూడా తెరపైకి వచ్చింది. ఒరిజినల్ హిందీ వెర్షన్‌తో పోలిస్తే ఇంగ్లిష్ వెర్షన్ 30 నిమిషాలు తక్కువగా ఉండటంపై ప్రేక్షకులు ప్రశ్నలు సంధిస్తున్నారు. కీలక సన్నివేశాలను కుదించడంతో కథలోని భావోద్వేగ గాఢత తగ్గిపోయి, విజువల్ అద్భుతాలకే ప్రాధాన్యం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రెండో వివాదం 'బ్రహ్మ' ఏఐ సాంకేతికత చుట్టూ తిరుగుతోంది. పాత్రల పెదవుల కదలికలకు అనుగుణంగా సంభాషణలను సరిపోల్చేందుకు ఏఐని ఉపయోగించడంపై కొందరు అభిమానులు అభ్యంతరం చెబుతున్నారు. ముఖ్యంగా పాశ్చాత్య ప్రేక్షకుల్లో సినిమాల్లో ఏఐ వినియోగంపై వ్యతిరేకత ఉండటంతో, సంప్రదాయ డబ్బింగ్ పద్ధతినే అనుసరించాల్సిందని సూచిస్తున్నారు. అయినప్పటికీ ఈ విమర్శలన్నీ హిందీ వెర్షన్‌పై అంచనాలను తగ్గించలేకపోతున్నాయి. అసలు భావోద్వేగాలు, సంభాషణల బలం, అద్భుతమైన దృశ్యవైభవంతో భారతీయ రామాయణాన్ని ప్రపంచానికి ఏ స్థాయిలో చూపిస్తారన్న ఉత్కంఠ కొనసాగుతోంది. వెండితెరపై రామకథ మొదలయ్యే వేళ.. అభిమానుల ఆశలన్నీ హిందీ వెర్షన్‌పైనే!

బాలయ్య పారితోషికం రూ.45 కోట్లు..!?

• కొరటాల శివతో భారీ యాక్షన్ డ్రామా • కెరీర్‌లోనే అత్యధిక రెమ్యునరేషన్?

నందమూరి నటసింహం బాలకృష్ణ బాక్సాఫీస్ బరిలో మరో భారీ వేటకు సిద్ధమవుతున్నారు. మాస్ యాక్షన్‌కు రాజకీయ వేడిని జోడించే పవర్‌ఫుల్ కథతో కొరటాల శివ దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'దాదా' చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్న బాలయ్య.. ఆ సినిమా ముగిసిన వెంటనే కొరటాల సినిమాపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. తాత్కాలికంగా 'ఎన్‌బీకే 112'గా పిలుస్తున్న ఈ ప్రాజెక్ట్ కోసం బాలకృష్ణకు ఏకంగా రూ.45 కోట్ల పారితోషికం అందనున్నట్లు తాజా ప్రచారం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇదే నిజమైతే బాలయ్య కెరీర్‌లోనే అత్యధిక రెమ్యునరేషన్ ఇదే కానుంది. కథలో రాజకీయ అంశాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్ ఘట్టాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టాక్. నిర్మాణ వ్యయాన్ని కూడా భారీ స్థాయిలో ఖర్చు చేసేందుకు నిర్మాతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. యువసుధ ఆర్ట్స్‌కు చెందిన సుధాకర్ మిక్కిలినేని, ఎస్ఎల్‌వీ సినిమాస్‌కు చెందిన సుధాకర్ చెరుకూరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. సంగీత దర్శకుడిగా తొలుత అనిరుధ్‌ను పరిశీలించినప్పటికీ, ఇప్పుడు ఆయన స్థానంలో జి.వి. ప్రకాశ్ కుమార్ పేరు వినిపిస్తోంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల మార్క్ కథనం తోడైతే థియేటర్లలో యాక్షన్ జాతర ఖాయమన్న అంచనాలు పెరుగుతున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.